


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక


ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 155 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 16 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 155 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 16 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది

- తమ మాట విని చైనా వెనక్కి తగ్గిందన్న ట్రంప్
- హర్మూజ్ ను ఇక మూసి ఉంచడం జరగదని ఉద్ఘాటన
- హర్మూజ్ ను తెరిచే ప్రయత్నాలపై చైనా సంతోషంగా ఉందని వెల్లడి
- చర్చలు యుద్ధం కన్నా మంచివని వ్యాఖ్యలు

పెన్ పవర్ డెస్క్:ఇకపై ఇరాన్‌కు ఎలాంటి ఆయుధాలు పంపబో మని చైనా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం కీలక ప్రకటన

మిగతా 2లో

# డీలిమిటేషన్‌తో దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం

- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కేసీఆర్ నిర్ణయం ఇదీ
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ సంపూర్ణ మద్దతు
- డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి
- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:భారత ప్రభుత్వం రేపు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే

మిగతా 2లో



## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం

### వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన

- పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా
- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత

హైదరాబాద్ పెన్ పవర్:పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని

మిగతా 2లో




## ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

పెన్ పవర్ డెస్క్:ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుం చనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. "మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కో సం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి.

మిగతా 2లో

## ఈ నెల 20న కాళేశ్వరంలో సీఎం రేవంత్ పర్యటన.. మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన



హైదరాబాద్ పెన్ పవర్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 20న కాళేశ్వర ప్రాజెక్టు పరిధిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించనున్నారు. గతంలో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ పియర్లను సీఎం పరిశీలించి,

మిగతా 2లో

# రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది

- ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని విమర్శ
- కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్ కాదన్న జీవన్ రెడ్డి
- కేసీఆర్‌కు ప్రజలు అంటే గౌరవం ఉందని వ్యాఖ్య



హైదరాబాద్ పెన్ పవర్:రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిందని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని ఆరోపించారు.

మిగతా 2లో



## మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' జరగొద్దు.. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో మార్కెట్ రుసుము వసూళ్లను పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో మార్కెటింగ్ యార్డులలో రూ. 568.50 కోట్లతో 630 అభివృద్ధి పనులను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిలో రూ. 128 కోట్ల విలువైన 113 పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. బుధవారం సచివాలయంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

మిగతా 2లో

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి...

### 12 మంది పరిస్థితి విషమం

- సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- 20 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం



పెన్ పవర్ డెస్క్:శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు

మిగతా 2లో

## వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స అందిచాలి..



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ప్రభుత్వ దవాఖానాల్లో తాగునీటి సౌకర్యం, అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్ల ఏర్పాటు, అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు, వడదెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు ఆసుపత్రులలో ప్రత్యేక ఏర్పాట్లు వంటి అంశాలపై ఉన్నతాధికారులతో

మిగతా 2లో

## మళ్లీ తోక జాడిస్తున్న పాక్...

### భారత్‌లో చొరబడేందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం!

- భారత్‌లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు పాక్ భారీ కుట్ర
- సరిహద్దుల్లో 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల పునరుద్ధరణ
- భారత్‌లో ఎన్నికలు, మధ్యప్రాచ్య సంక్షోభమే పాక్‌కు అదును
- కొత్త వ్యూహంతో ఒకేసారి పలుచోట్ల నుంచి చొరబాట్లకు ప్లాన్

పెన్ పవర్ డెస్క్:జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టిం చేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపిం ది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచి స్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ), అంతర్జాతీ య సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యా డ్‌లను

మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## నవయుగ వైతాళికుడు వీరేశలింగం

తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహోన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు. బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహోన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజమండ్రిలో జన్మించారు. బ్రిటీష్ హయాంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు. జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు,తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు. వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసుకు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించుకున్నారు. ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్ధని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు.ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు? ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్ధని'ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి. ఆయన 130కి పైగా గ్రంధాలు రాసాడు. అన్ని గ్రంధాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు.ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు. వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కరణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం.

# మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' జరగొద్దు..
# మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

- మొదటి పేజి తరువాయి
ఇంకా కొన్ని చోట్ల జీరో బిజినెస్ జరుగుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వస్తోందని, దీనిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అక్రమాలకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేయడానికి వెనుకాడవద్దని, దీనికి ఎవరైనా అధికారులు సహకరిస్తే వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వాటి పురోగతిని ప్రతిరోజూ సమీక్షించేలా ఒక డాష్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు అవసరమైన సౌకర్యాలను ప్రాధాన్యత క్రమంలో కల్పించాలని సూచించారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీలో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' సాఫ్ట్‌వేర్ పనితీరును పరిశీలించి, ఫలితాలు ఆశాజనకంగా ఉంటే అన్ని మార్కెట్ యార్డులను డిజిటలైజేషన్ చేసి జీరో బిజినెస్‌ను అరికట్టాలని పేర్కొన్నారు.కోహెడ పండ్ల మార్కెట్ పనులకు సంబంధించి సర్వే పూర్తయిందని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి పనికి ప్రారంభ తేదీ, గడువు తేదీని నిర్ణయించుకుని నిర్దిష్ట కాలపరిమితిలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు గ్రిడ్ అనుసంధానంతో కూడిన సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. జూలై చివరికల్లా ఈ పనులు పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టారు.

**పారదర్శకంగా పంటల కొనుగోళ్లు..**

ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన తార్పాలిన్లు, తేమ కొలిచే పరికరాలు, క్లీనింగ్ డ్రైయర్లను అన్ని కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పండించిన రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరిపి, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముఖ్యమంత్రి అనుమతితో నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కార్యదర్శి సురేంద్ర మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 20న కాళేశ్వరంలో సీఎం రేవంత్ పర్యటన.. మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన

- మొదటి పేజి తరువాయి
పునరుద్ధరణ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించను న్నారు. అదేవిధంగా కాళేశ్వరంలోని గోదావరి నది వద్ద జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించనున్నారు. పర్యటన ముగింపులో ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టుల భవిష్యత్తుపై ఆయన కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు (రాతీఅస్త్రుఖుతీ దీుఎబ) ఇప్పటికే రంగంలోకి దిగారు. జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగంతో కలిసి భద్రత, సభా ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనలో ఎక్కడా లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

## వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స అందిచాలి..

- మొదటి పేజి తరువాయి
మంత్రి బుధవారం సమీక్ష చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎండాకాలం నేపథ్యంలో వడదెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు తీసుకుంటున్న చర్యలను, ఆసుపత్రులలో అవుట్ పేషెంట్, ఇన్-పేషెంట్ల కోసం చేసిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. వడదెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని ఆసుపత్రుల్లో ఇప్పటికే ఏర్పాట్లు చేశామని, అవసరమైన మెడిసిన్, ఓఆర్ఎస్ (రా=రా) వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవుట్ పేషెంట్లు, ఇన్-పేషెంట్లు, వారి అటెండెంట్లకు మరియు సిబ్బందికి తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పెద్ద ఆసుపత్రులలో ప్రతి బ్లాక్‌లో, ప్రతి ఫ్లోర్‌లో డ్రింకింగ్ వాటర్ సౌకర్యం ఉండాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున రోగులకు, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని, ఐసీయూలలో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. రిపేర్లు ఉంటే వెంటనే చేయించాలని, అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలని సూచించారు.వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు, రైతులు, ఆటో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్‌కు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డుల్లో ప్రత్యేక వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే జనరేటర్లు పనిచేసేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉన్నందున అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు.

# మళ్లీ తోక జాడిస్తున్న పాక్...
## భారత్‌లో చొరబడేందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం!

- మొదటి పేజి తరువాయి
పునరుద్ధరిం చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం.ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దీంతో పాక్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున ఉగ్రవాదుల బృందాలను పంపి, భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని చూస్తోంది. ఈ పద్ధతిలో కనీసం కొందరైనా లోపలికి ప్రవేశించగలరని వారు భావిస్తున్నారు.గతేడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు

నిలిచిపోవడంపై లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి...

- మొదటి పేజి తరువాయి
మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది.వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్

దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం

- మొదటి పేజి తరువాయి
బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## డీలిమిటేషన్‌తో దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం

- మొదటి పేజి తరువాయి
జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పట్టు కోల్పోయింది

- మొదటి పేజి తరువాయి
కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి ఖతం చేస్తున్నాడని అన్నారు.
కేసీఆర్ తన వయసును గౌరవించి 'అన్న' అని పిలుస్తారని తెలిపారు. కేసీఆర్‌కు ప్రజలంటే గౌరవం ఉందని, ఆయన రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కాదని వ్యాఖ్యానించారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరడంపై స్పందిస్తూ, ఆఖరి వరకు ప్రజల కోసమే పోరాడతానని స్పష్టం చేశారు. సాధారణంగా పార్టీ సూచనలను బట్టి ప్రభుత్వం నడుస్తుందని, కానీ రేవంత్ రెడ్డి పాలనలో ప్రభుత్వం సూచన మేరకు పార్టీ నడుస్తుందని విమర్శించారు.

### ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

- మొదటి పేజి తరువాయి
ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధీ వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం
అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.
జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

## ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది

- మొదటి పేజి తరువాయి
చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తెరిచి ఉంచేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలకు చైనా మద్దతు తెలిపిందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయంపై తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "ఇకపై హర్మూజ్ ను మూసి ఉంచడం జరగదు. హర్మూజ్ జలసంధిని నేను శాశ్వతంగా తెరుస్తుండటం చైనాకు చాలా సంతోషాన్నిచ్చింది. అమెరికాతో పాటు ప్రపంచం కోసం నేను ఈ పని చేస్తున్నాను. వారు ఇరాన్‌కు ఆయుధాలు పంపబోమని అంగీకరించారు" అని ఆయన రాసుకొచ్చారు.ప్రపంచ ఇంధన సరఫరాలో హోర్మూజ్ జలసంధి చాలా కీలకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. మరోవైపు, చైనా ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తోందంటూ గతంలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో తనకున్న సంబంధాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. "నేను చైనా వెళితే అధ్యక్షుడు షీ జిన్ పింగ్ నన్ను గట్టిగా ఆలింగనం చేసుకుంటారు. మేమిద్దరం కలిసి తెలివిగా పనిచేస్తున్నాం. ఇది యుద్ధం కన్నా మంచిది కదా?" అని వ్యాఖ్యానించారు. అయితే, అవసరమైతే యుద్ధానికి కూడా అమెరికా సిద్ధమేనని హెచ్చరించారు.కాగా, అమెరికాతో ఇరాన్ చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం నెరుపుతున్నప్పటికీ, ఇరాన్ ను చర్చల వరకు తీసుకురావడం వెనుక చైనా హస్తం ఉందని ఇప్పటికే పలు కథనాలు వచ్చాయి. తెరవెనుక చైనా మంత్రాంగం నడుపుతోందని భావిస్తున్నారు. ఈ క్రమంలో, ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్



దొమ్మర పోచంపల్లి 9వ వార్డు(పాతది) లో ప్రైవేటు పాఠశాల కోసం నిర్మాణం..




అదే నిర్మాణానికి అడ్మిషన్‌లు ప్రారంభం ఫ్లెక్సీ..

# ముడుపులే లక్ష్యంగా..?
# నిబంధనలకు పాతర..?

### అనుమతులపై ప్రశ్నిస్తే..! గోప్యంగా ఉంచుతున్న "అధికారులు-చైన్‌మెన్‌లు"..




- ప్రమాదకర కట్టడాలు ప్రోత్సహిస్తున్న దుండిగల్ టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం..
- అక్రమ నిర్మాణాల నియంత్రణకు నియమించిన చైన్‌మెన్‌ల పర్యవేక్షణేది..?
- అధికారులు-చైన్‌మెన్‌ల పర్యవేక్షణ 'ఆమ్యామ్యాల'కే పరిమితమైందా..?
- 'బిల్డ్‌నవ్'పర్మిషన్‌లు జారీచేసిన దుండిగల్ పట్టణ ప్రణాళిక, పర్యవేక్షణ శూన్యం..



దుండిగల్ సర్కిల్ టెక్ మహీంద్రా ఎదురుగా, స్టిల్ట్+5 అంతస్తుల నిర్మాణం..

- దుండిగల్ సర్కిల్‌లో చర్యలకు తావుండదు..! ప్రశ్నిస్తే సమాధానం ఉండదు..!
- కొత్త చైన్‌మెన్‌ల లిస్టులో.. పాత చైన్‌మెన్ రాము (రమేష్‌ను) నియామకం..!
- ప్రశ్నిస్తే 'టిపిఎస్‌ను-తిరుపతి'ని అడగమని చెబుతున్న చైన్‌మెన్ రాము..!
- అక్రమ నిర్మాణ దారుల బరితెగింపు..! అధికారుల ఉదాసీనతతో ఆకాశహర్మ్యాలు..

- అడపాదడపా చర్యలు తీసుకున్నప్పటికీ..! అక్రమ నిర్మాణాలు చెక్కుచెదరవు..!
- అధికారుల అక్రమార్జన కోసమే ఈ నిర్మాణ చట్టాలు అమలు చేశారా..? అన్నట్టుంది..!
- దుండిగల్‌లో చక్రం తిప్పేదే చైన్‌మెన్‌లు..? అంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి..
- కరప్షనే ధ్యేయంగా..? కలెక్షన్‌లే లక్ష్యంగా..? చట్టాలను కాలరాస్తూ,నిబంధనలకు తూట్లు.
- ప్రభుత్వ ఖజానాకు గండి..! అధికారులు-చైన్‌మెన్‌ల ఖజానాకు మళ్ళింపు..?
- చైన్‌మెన్‌లను కలెక్షన్ ఏజెంట్‌లుగా మారుస్తున్నారని విమర్శలు వస్తున్నాయి..?
- నోటీసులు-సీజింగ్‌లు..! అధికారులకు 'నిధులు' సమకూర్చే 'గనులా'..?

'టిజి-బిపాస్- బిల్డ్‌నవ్' నిర్మాణ చట్టాలను- నిబంధనలను, అధికారులే నిర్వీర్యం చేస్తున్నారని ఈ అక్రమ కట్టడాలతో తేటతెల్లం చేస్తోంది.. చట్టబద్ధంగా పర్మిషన్‌లు మంజూరు చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికార యంత్రాంగం.. అనుమతులకు విరుద్ధంగా, నిబంధనలు ఉల్లంఘించిన, పలు అక్రమ కట్టడాలపై, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.. ఈ వ్యవహారం మొత్తం అధికారుల కనుసన్నల్లోనే సాగుతున్నాయనే విమర్శలు తలెత్తుతున్నాయి.. ఈ టౌన్‌ప్లానింగ్ ముఖ్య విభాగంలో మరో ప్రమాదకర అంశం ప్రశ్నార్థకంగా తయారైంది.. అక్రమ కట్టడాల నియంత్రణ పేరిట.. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించడం సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. టౌన్‌ప్లానింగ్ అధికారుల కంటే, పర్మిషన్‌లు ఇప్పించడంలో చైన్‌మెన్‌లే కీలకపాత్ర పోషిస్తుట్టు సమాచారం.. ఒక్కో చైన్‌మెన్, తమ పరిధిలోని బిల్డర్‌లకు సంబంధించిన, నిర్మాణ అనుమతులు మంజూరు చేయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తారట.. మరోవైపు కాసుల కక్కుర్తితో ప్రమాదకర అక్రమ కట్టడాలపై, అధికారుల చర్యలు కూడా తాత్కాలిక ఉపశమన మేనని పరోక్షంగా స్పష్టతను ఇస్తునారు..!

ముగ్గురు పాత చైన్‌మెన్‌లను శాఖలు మార్చినట్లుగా నమ్మబలికిన అధికారులు..! నూతన చైన్‌మెన్‌ల నియామక ప్రక్రియను ముందుంచడం వెనుక, అధికారుల స్కెచ్‌లో భాగమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అధికారులను సంతృప్తి పరిచి, ఆర్థిక లావాదేవీలు, గుట్టు చప్పుడు కాకుండా, చక్కబెట్టే ఓ పాత చైన్‌మెన్‌కు మాత్రం టౌన్‌ప్లానింగ్ విభాగంలో, కీలక బాధ్యతలు అప్పగించడంపై స్థానికంగా చర్చించుకుంటున్నారు.. సంబంధిత చైన్‌మెన్‌కు, గత ఎనిమిదేళ్ళ కాలంలో, పలువురు పేరుమోసిన బడా బిల్డర్‌ల పరిచయం ఉన్నందుకే ఈ ప్రాధాన్యతకు కారణంగా తెలుస్తుంది.. అధికారులకు కామధేనువుగా మారిన ఆ చైన్‌మెన్‌ను ఎలా వదులు కోగలరు అంటూ కొందరు ఎద్దేవా చేసేవారు లేకపోలేదు.. అటు అనుమతులు ఇప్పించడం మొదలుకుని..! అక్రమ నిర్మాణాల వ్యవహారంలో, ఎవరెవరికి ఏమేరకు ముట్టచెప్పాలో, నిర్ధారించే ఆ చైన్‌మెన్ (ఔట్ సోర్సింగ్ సిబ్బంది)పై, బాధ్యత గల అధికారులు ఆధారపడటం, ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.. "చట్టాలను ధిక్కరించి-నిబంధనలు ఉల్లంఘించిన అక్రమ కట్టడాలపై చర్యలు లేకుండా చూడటంలోనూ ఆ చైన్‌మెన్ మాస్టర్ డిగ్రీ పూర్తి చేశాడు అనడంలో అతిశయోక్తి కాదు.. పై అధికారులను మెప్పించి, లాగిన్ వ్యవస్తనే, తన గుప్పిట్లో పెట్టుకున్న నేర్పరి అంటూ విమర్శలు వస్తున్నాయి.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 15:

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రజావాణి ఫిర్యాదుకు..!
# స్పందించిన కలెక్టర్..

### ఆకుల సతీష్ టీమ్ కృషికి ఫలితం..! రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ..!

- దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెం.166/1 ప్రభుత్వ భూవివాదం..
- ఎక్స్ సర్వీస్ మెన్‌కు కేటాయించిన భూమి వివాదాస్పదంగా తయారైంది..
- భూ కేటాయింపు ఒకచోట.. స్వాధీనం మరోచోట..దీంతో ఆకుల సతీష్ ఫిర్యాదు..
- 2024లో కబ్జాలో జీవన్‌రెడ్డి.. అదనపు కలెక్టర్ సందర్శించి చర్యలకు ఆదేశాలు..
- 2024 ఆగష్టు 7న దుండిగల్ తహశీల్దార్ ఆధ్వర్యంలో కబ్జాలు కూల్చివేత..
- మళ్ళీ 2026లో అదే స్థలంలో మట్టినింపి చదునుపై.. ప్రజావాణి ఫిర్యాదు..
- జారీచేసిన ప్రొసీడింగ్‌ను జిల్లా కలెక్టర్ రద్దు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ..
- కలెక్టర్ ఆదేశాలతో సర్వే నెం.166/1 ఆక్రమిత భూమిలో తహశీల్దార్ బోర్డు..




బౌరంపేట్‌లో ఆక్రమిత ప్రభుత్వ భూమికి దుండిగల్ తహశీల్దార్ నోటీసు బోర్డు..

-5లో


# అదే జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారు
## బీజేపీకి కేటీఆర్ హెచ్చరిక

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తామన్న కేటీఆర్
- డీలిమిటేషన్ బిల్లు పేరుతో దక్షిణాదికి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక
- బీజేపీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శ



-7లో

# ముడుపులే లక్ష్యంగా..? నిబంధనలకు పాతర..?




దొమ్మర పోచంపల్లి పాత 9వ వార్డులో ఐదంతస్తుల అక్రమ నిర్మాణం..




ఎంఎల్ఆర్ఐటి ఎదురుగా అనుమతుల్లేని అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణం..




దొమ్మర పోచంపల్లి పోలీస్ స్టేషన్ వెనుక వైపు కాలనీలో భారీ షెడ్డు నిర్మాణం..

## రంగులేస్తే రైటైపోతుందా..?

బయట రంగులు..!లోపల పనులు..! ఈ విధానాని అవలంబించిన, అక్రమ కట్టడాలకు, టిజి-బిపాస్-బిల్డ్‌నవ్ చట్టాలలో, చర్యలకు మినహాయింపు ఉందా..? దొమ్మర పోచంపల్లిలోని ఈ ప్రైవేటు పాఠశాల భవన నిర్మాణం తోపాటు, పక్కనే మరో భారీ 5 అంతస్తుల అక్రమ నిర్మాణంలో 'బయట రంగులు లోపల పనులు' శరవేగంగా కొనసాగుతున్నాయి.. ఈ వ్యవహారం మొత్తం చైన్‌మెన్‌ల అండతోనే కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. అందుకు ప్రశ్నిస్తే సమాధానం ఉండదు.. అయితే అక్రమ నిర్మాణం ఏదైనా ముందుగా బయట వైపు త్వరితగతిన రంగులు వేసుకోని, లోపల పనులు చేసుకోవాలని అక్రమార్కులకు సలహాలు ఇస్తున్నట్టు స్థానికుల ఆరోపణలు వినవస్తున్నాయి.. తీసుకున్న ముడుపులకు ఆ మాత్రం ఉచిత సలహాలు సూచనలు ఇవ్వడంలో తప్పేముంది అనేతీరుతో కొందరు ఎద్దేవా చేస్తున్నారు..

- 3 పేజి తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్‌లో అక్రమ నిర్మాణాల దందా రోజు రోజుకు మితిమీరి పోతోంది.. ప్రమాదకర అక్రమ నిర్మాణాలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్న, అనేక ఆరోపణలు వస్తున్నాయి.. నిర్మాణ చట్టాలు అమలు చేయాల్సిన అధికారులు, అక్రమార్కులతో కుమ్మక్కు అవుతున్నారని స్పష్టమవుతుంది.. టెక్ మహీంద్రా ఎదురుగా (పాత మున్సిపల్ 10వ వార్డు) గండిమైసమ్మ చౌరస్తా, దొమ్మర పోచంపల్లి, దుండిగల్ విలేజ్ పరిధిలో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి.. దొమ్మర పోచంపల్లి గ్రామం (పాత మున్సిపల్ 9వ వార్డు)లో.. దుండిగల్ పోలీస్ స్టేషన్ వెనుకవైపు ప్రమాదకరంగా నిర్మించే అక్రమ భారీ నిర్మాణాలు, టౌన్‌ప్లానింగ్ అండతో చైన్‌మెన్‌ల కనుసన్నల్లోనే సాగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.. దాదాపు మూడు అక్రమ షెడ్లు, ఓ ప్రైవేటు పాఠశాల నిర్వహణ కోసం, భారీ అక్రమ భవన నిర్మాణం.. మరో భారీ నిర్మాణంలోనూ, బయట రంగులు లోపల పనులు.. ఈ నిర్మాణాలలో సెట్‌బ్యాకులు జీరో, అదనపు అక్రమ అంతస్తులు..

## టెక్ మహీంద్రా ఎదురుగా..! ప్రమాదకర నిర్మాణం..!

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు-చైన్‌మెన్‌లు అక్రమ నిర్మాణాలపై ప్రశ్నిస్తే సమాధానం ఉండదు.. ఎందుకంటే వాళ్లకు తెలిసే జరుగుతున్నవి కాబట్టి.. అనుమతులపై సమాధానం ఇస్తే, అధికారుల ముడుపుల బండారం, బయట పడుతుందని కాబోలు.. పాత మున్సిపల్ 10వ వార్డు పరిధిలోని టెక్ మహీంద్రా ఎదురుగా, రెసిడెన్షియల్ అనుమతులతో 'ఓయో' హోటల్‌ల కోసం భారీ అక్రమ నిర్మాణాలు చైన్‌మెన్‌లకు తెలియకుండా జరగవని స్థానికుల ఆరోపిస్తున్నారు.. ఓ అక్రమ నిర్మాణాన్ని పక్కింటికి ఆనుకుని నిర్మిస్తూ, ఏమాత్రం సెట్‌బ్యాకులు లేకుండా..! స్టిల్ట్‌లో పార్కింగ్ స్థలం కూడా ఆక్రమించి, గదులు నిర్మిస్తూ పైన ఐదంతస్తుల నిర్మాణం, ఇంత ప్రమాదకర భవనాలపై పర్యవేక్షణ లేకపోతే ప్రజలను ప్రమాదంలో పెట్టినట్టు కాదా..? రెసిడెన్షియల్ పర్మిషన్‌ల నిర్మాణాలు కమర్షియల్ కార్యకలాపాలకు వినియోగిస్తుంటే టౌన్‌ప్లానింగ్ అధికారులు-చైన్‌మెన్‌లు ముడుపులతో సరి పెడతన్నట్టు స్పష్టమవుతుంది..

మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ అక్రమ నిర్మాణాల పర్వం కొనసాగటం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు..

## ప్రైవేటు పాఠశాల నిర్వహణకు.. ప్రమాదకర కట్టడం..

**దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలోని దొమ్మర పోచంపల్లి (పాత మున్సిపల్ 9వ వార్డు)లో, పోలీస్ స్టేషన్ వెనుక వైపు ఓ ప్రైవేటు పాఠశాల కోసం నిర్మిస్తున్న, ఈ భారీ భవన నిర్మాణం రెసిడెన్షియల్ అనుమతు లతో అత్యంత ప్రమాదకరంగా నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ భారీ అక్రమ కట్టడానికి ఎలాంటి సెట్‌బ్యాకులు లేకుండా, పార్కింగ్(స్టిల్ట్‌లో) ఏరియాను కూడా, ఆక్రమించి అక్రమంగా గదులు నిర్మించడానికి టౌన్‌ప్లానింగ్ "అధికారులు-చైన్‌మెన్‌ల" అండ లేకుండా సాధ్యమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణం నిరాటంకంగా సాగుతుండటంలో పాత చైన్‌మెన్‌ను అడగమని, ప్రస్తుత చైన్‌మెన్ రాము, చెప్పడం గమనార్హం.. నిర్మాణంలో ఉన్న ఈ అక్రమ భవనానికి ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం '2026-2027 అడ్మిషన్‌లు' కూడా ప్రారంభమైనట్లు, బిల్డింగ్ చుట్టూ(ఎల్ ఆకారంలో) ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం..**

## పర్మిషన్ ఒకటే..! నిర్మాణాలు రెండు..?




అనుమతుల్లేనిది ఒకటి- రెండవది అనుమతులు ఉన్నా నిబంధనలు సున్నా..

అదేదో పాత సామెత "వడ్డించేవాడు మనవాడైతే, బంతిలో ఎక్కడ కూర్చున్నా.. పంచభక్ష పరమాన్నం కూడా అందుందట".. అన్నట్టు "అధికారులు-చైన్‌మెన్‌లు- మనవాళ్ళైతే" ఎంతటి అక్రమ నిర్మాణాలైనా నిర్మించుకోవచ్చని దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాలపై నిరూపిస్తున్నారు.. దుండిగల్ ఎంఎల్ఆర్ఐటి ఎదురుగా రెండు నిర్మాణాలు సుమారు 400+400 గజాల స్థలంలో స్టిల్ట్ం5 అంతస్తులు నిర్మిస్తున్నారు.. అయితే నిబంధనలు పాటించని రెండింటిలో ఒక నిర్మాణానికి మాత్రమే పర్మిషన్ ఉన్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారుల సమాచారం.. దుండిగల్ గ్రామ పరిధిలోని "ఎంఎల్ఆర్ఐటి" ఎదురుగా గ్రామ పరిధిలోని సర్వే నెంబర్: 446/2/ఆ, మరియు 446/2.. ప్లాట్ నెంబర్: 329 అండ్ 335కు.. దుండిగల్ మున్సిపాలిటీలో "రెసిడెన్షియల్ బిల్డింగ్ పర్మిషన్"కు దరఖాస్తు చేసుకోగా 'స్టిల్ట్ + 4' అంతస్తులకు, పర్మిట్ నెంబర్: 0015/DUND/SWBP/2025.. తేదీ: 09/09/2025న, అనుమతులు మంజూరు చేశారు.. ఈ నిర్మాణంలోనే అదనపు అంతస్తు, సెట్‌బ్యాకుల ఆక్రమణ స్పష్టంగా కనిపిస్తుంది.. పక్కనే ఆనుకుని ఇదే తరహా " స్టిల్ట్+5 నిర్మాణం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నట్టు స్థానికుల సమాచారం.. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చైన్‌మెన్‌లు, నిత్యం పుట్టింగుల దశనుండే పర్యవేక్షణ ఉంటుంది.. అయినప్పటికీ ఎలాంటి పర్మిషన్ లేకుండా, 5 అంతస్తులు నిర్మించే వరకు టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టిలో లేదంటే నమ్మశక్యంగా లేదని పలువురు ఆరోపిస్తున్నారు..



అనుమతులు ఉన్నా బిల్డింగ్ చుటూ 7 ఫీట్లు, ముందు వైపు దాదాపు 17 ఫీట్ల సెట్‌బ్యాకులు జీరో..



గండిమైసమ్మలో సర్వే నెం.168, నిర్మాణాలి నిషేధించిన భూమిలో.. అనుమతుల్లేని అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణం..




బౌరంపేట్‌లో ఆక్రమిత ప్రభుత్వ భూమికి దుండిగల్ తహశీల్దార్ నోటీసు బోర్డు..




రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు..

# ప్రజావాణి ఫిర్యాదుకు..! స్పందించిన కలెక్టర్

## ఆకుల సతీష్ టీమ్ కృషికి ఫలితం..! రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ..!

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 15:**


ఎట్టకేలకు ఆక్రమిత ప్రభుత్వ భూమిలో దుండిగల్ రెవెన్యూ అధికారులు, నోటీసు బోర్డు పెట్టారు.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం, బౌరంపేట్ గ్రామ పరిధిలోని, సర్వే నెంబర్ 166/1 భూమిని, 166/9/2 భూమిగా, 17-01-2026న జారీ చేసిన కలెక్టర్ ప్రొసీడింగ్ నెంబర్: A1/899/2024 పై, స్థానికుల అభ్యంతరాల మేరకు..! మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి ఫిర్యాదు మేరకు.. కలెక్టర్ మను చౌదరి 13-04-2026న రద్దుచేస్తూ, బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.. సర్వే నెం.166/9/2 భూమిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, నిన్న సంబంధిత భూమిని ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు.. ప్రొసీడింగ్ నెంబర్. A1/899/2024 (తేదీ: 13-04-2026) ప్రకారం తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆ భూమిలోకి ప్రవేశాన్ని నిషేధించారు. దుండిగల్ తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి ఆద్వర్యంలో కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తూ.. నోటీసు బోర్డును ఏర్పాటు చేశారు..

- దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెం.166/1 ప్రభుత్వ భూవివాదం..
- ఎక్స్ సర్వీస్ మెన్‌కు కేటాయించిన భూమి వివాదాస్పదంగా తయారైంది..
- భూ కేటాయింపు ఒకచోట.. స్వాధీనం మరోచోట..దీంతో ఆకుల సతీష్ ఫిర్యాదు..
- 2024లో కబ్జాలో జీవన్‌రెడ్డి.. అదనపు కలెక్టర్ సందర్శించి చర్యలకు ఆదేశాలు..
- 2024 ఆగష్టు 7న దుండిగల్ తహశీల్దార్ ఆధ్వర్యంలో కబ్జాలు కూల్చివేత..
- మళ్ళీ 2026లో అదే స్థలంలో మట్టినింపి చదునుపై.. ప్రజావాణి ఫిర్యాదు..
- జారీచేసిన ప్రొసీడింగ్‌ను జిల్లా కలెక్టర్ రద్దు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ..
- కలెక్టర్ ఆదేశాలతో సర్వే నెం.166/1 ఆక్రమిత భూమిలో తహశీల్దార్ బోర్డు..

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సమస్యలను, తక్షణ పరిష్కరం కోసం, వారం వారం నిర్వహిస్తున్న, ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఓ ఫిర్యాదుకు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి వెంటనే స్పందించారు.. రూ.100 కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకుని బుధవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో నోటీసు బోర్డును ఏర్పాటు చేశారు.. వివరాల్లోకి వెళ్ళితే.. అకుల సతీష్ అండ్ టీమ్ తెలిపిన వివరాల ప్రకారం.. బౌరంపేట్ సర్వే నెంబర్ 166/1, ఉన్న దాదాపు 5 ఎకరాలు, సుమారు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని.. ఎక్స్ సర్వీస్ మెన్ పట్టా పేరుతో అక్రమంగా ఆక్రమించి, దాన్ని సక్రమం చేసుకోవడానికి తప్పుడు ప్రొసీడింగ్ పొందిన విషయంపై, పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించామని, ఈ నేపథ్యంలో తమపై దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టిన జీవన్‌రెడ్డి వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆకుల సతీష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. ఈ మేరకు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆధారాలతో ఫిర్యాదు చేయగా కలెక్టర్ వెంటనే స్పందించారని సతీష్ తెలిపారు..


పెన్ పవర్
4 పెన్ పవర్ మంగళవారం 14 ఏప్రిల్ 2026
రూ.100 కోట్లు విలువైన..! ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు..!
బౌరంపేటలో ఈ భూకబ్జా బట్టబయలు..! ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..!


పెన్ పవర్


PROCEEDINGS OF THE COLLECTOR AND DISTRICT MAGISTRATE
MEDCHAL-MALKAJGIRI DISTRICT

PRESENT:- SRI MIKKILINENI MANU CHOUDARY, I.A.S.,

Procs No.A1/899/2024 Date 13-04-2026

Sub:-Correction-Sub-Division Sy. No. 166/9/1 Ac. 05-06 gts, and Sy. No. 166/9/2, Ac. 04-38 gts, in supplementary sethwar / revenue records, of Bowrampet (V) Gandimaisamma-Dundigal Mandal - kept in abeyance of Procs No.A1/899/2024 Dated 17-01-2026 – orders – issued – Reg.

Ref:-1) Lr. No. B/263/2024 dt 27-2-2024 of Tahsildar Gandimaisamma-Dundigal
2)Application submitted by Sri Jeevender Reddy dated 04-07-2024.
3)Hon'ble High Court of T.G Hyd, orders in W.P. No. 5745 of 2025 dt 25-02-2025.
4) This Rc. No. A1/899/2024 allotted to Dy. IOS (Hqrts) dt 11-12-2024
5)Report of submitted by Dy. Inspector of Survey (Hqrts) dt 12-5-2025.
6)Revenue Divisional Officer Malkajgiri Lr. No. B/3161/2025 dt 19-11-2025
7)Report of the Assistant Director (S&LRs) Medchal-Malkajgiri Dist
8)This office Procs No. A1/899/2024 dated 17-01-2026
9) Dist Collector Prajavani Petition Regd. MDLLC/E/2026/00068 dt 13-4-2026 A Application of Sri Akula Sathish R/o Nizampet, Medchal dt 13-4-2026.
10) Dist Collector Prajavani Petition Regd. MDLLC/E/2026/00066 dt 13-4-2026 A Application of Sri D. Prabhakar Reddy R/o Bowrampet dt 13-4-2026.

ORDER:

Through the reference 9th cited, several villagers and Sri Akula Sathish R/o Nizampet has submitted an application in Prajavani on 13-04-2025 stating that proceedings issued in procs No. A1/899/2024 date 17-01-2026 concerning subdivision of land in Sy. No. 166/9 of Bowrampet village Dundigal-Gandimaisamma Mandal which appear to be legally unsustainable. As per proceedings sub-division Sy. No. 166/9/1 (Ac. 5-06 gts) and Sy. No. 166/9/2 (Ac 4-38 gts) gts have been incorporated in revenue records and requested to cancel the same and to protect of Government land.

Further through the reference 9th cited one Sri D. Prabhakar Reddy R/o Bowrampet has represented that the Sy. No. 166/1, showing in Sy. No. 166/9 Ac. 4-38 gts illegally occupied by Ex-Service man and requested to cancel the Dist Collector orders and protect the Govt lands.

In this regard, vide 8th cited permission accorded earlier to incorporate the sub-division Sy. No. 166/9/1 to an extent of Ac. 05-06 gts, and Sy. No. 166/9/2, to an extent of Ac. 04-38 gts, in all revenue records, village map situated at Bowrampet village, Gandimaisamma-Dundigal Mandal, Medchal-Malkajgiri District.

In view of the several objections received, the Procs No.A1/899/2024 dated 17-01-2026 for creation of sub-division Sy. No. 166/9/1 Ac. 05-06 gts, and Sy. No. 166/9/2, Ac. 04-38 gts, at Bowrampet village, Gandimaisamma-Dundigal Mandal are hereby kept in abeyance till the completion of detailed enquiry duly conducting hearing by issuing notices.

The Tahsildar Gandimaisamma-Dundigal Mandal is hereby instructed to take necessary action in the matter and under intimation to this office.


District Collector
Medchal-Malkajgiri Dist.

To
The Tahsildar Gandimaisamma-Dundigal (M) for information and necessary action.
Copy to the Sri Akula Sathish R/o Nizampet, Medchal for information
Copy to Sri D. Prabhakar Reddy R/o Bowrampet for information.

జారీచేసిన ప్రొసీడింగ్ రద్దుచేసిన ఉత్తర్వులు..

### ప్రొసీడింగ్ రద్దు చేస్తూ ఉత్తర్వులు..

రూ.100 కోట్లు విలువైన ప్రభుత్వ భూమి కబ్జాపై, ఆకుల సతీష్ ఫిర్యాదుకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ స్పందించారు.. కలెక్టర్ గతంలో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి, ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.. ఈ ఉత్తర్వుల మేరకు దుండిగల్ ఎమ్మార్వో తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత భూమిని ప్రభుత్వ అధీనంలోకి తీసుకుంటూ బోర్డు ఏర్పాటు చేశారని సతీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు... అదేవిధంగా కబ్జాదారులు ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని దుర్వినియోగం చేసుకునేందుకు దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం వంటి చర్యలకు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడబోమని స్పష్టం చేశారు.. ప్రభుత్వ భూములను కాపాడటం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు..ఈ చర్యలలో భాగంగా తక్షణమే స్పందించిన కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ విజేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు సందర్భంగా తీసిన ఫొటో..

# 8వ రోజుకు ఆర్టిజన్ కార్మికుల సమ్మె





**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 15:**విద్యుత్ శాఖ ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 8వ రోజుకు చేరుకుంది మహబూబాబాద్ డివిజనల్ కార్యాలయం ముందు అన్ మ్యాడ్ ఆర్టిజన్ ఉద్యోగులు భారీ ఎత్తున నిరసన చేపట్టారు ఆర్టిజన్ల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విద్యా అర్హతలను బట్టి కన్వర్షన్ ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆర్టిజన్ జేఏసీ బాధ్యులు సిరిపంగి నరేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా పరిష్కారానికి కృషి చేయడం లేదని అన్నారు. ఒకే సంస్థలో పనిచేస్తున్నప్పటికీ రెగ్యూలర్, ఆర్టిజన్ ఉద్యోగులకు వేర్వేరు రూల్స్ పాటిస్తుండటంతో ఆర్థికంగా నష్ట పోతున్నామని వాపోయారు. సమస్యలు పరిష్కరించకపోగా, సమ్మెకు దిగినందుకు ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం దారుణమని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన స్పందన లేకపోవడంతోనే విధి లేక సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఆర్టిజన్ ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గార్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్స్ గట్టు యుగంధర్ ఉపేందర్ రవి జై నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కట్నం వేధింపుల పై కేసు నమోదు



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 15:** అదనపు కట్నం కోసం వేధిస్తున్న కుటుంబం పై కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం గార్ల మండల పరిధిలోని కొత్త పోచారం గ్రామానికి చెందిన పసుపులేటి వినయ్ దీక్షిత లు సాంప్రదాయ బద్దంగా వివాహం చేసుకోగా గత మూడు సంవత్సరాల నుంచి దీక్షితను అదనంగా కట్నం తేవాలని భర్త వినయ్ అత్త, పసుపులేటి నీలమ్మలు వేధిస్తున్నారని పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేసిన వారిలో మార్పు రాలేదని ఇంకా తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని భాధిత మహిళ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందజేయగా వెంటనే బాధితురాలు ఇంటికి వెళ్లి బాధితురాలి వద్ద నుండి దరఖాస్తు స్వీకరించి అదనపు వరకట్నం వేధింపులపై భర్త పసుపులేటి వినయ్ అత్త పసుపులేటి నీలమ్మ పై కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

# హెల్మెట్ ప్రాముఖ్యత పై బైక్ ర్యాలీ



**గార్ల పెన్ పవర్ ఏప్రిల్ 15:**ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని హెల్మెట్ ధరించాలని గార్ల సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత హెల్మెట్లు ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి 60 మంది యువతీ యువకులు పోలీస్ సిబ్బంది హెల్మెట్లు ధరించి నిర్వహిస్తున్న బైకు ర్యాలీని బుధవారం పెద్ద కిష్టాపురం సర్పంచ్ గంగావతి రామ్ సింగ్ నాయక్ తో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభించారు అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూటూవీలర్ల రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ మంది హెల్మెట్లు ధరించని వారు మృత్యువాత పడుతున్నారన్నారు. ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరే ముందు తమకంటూ ఒక కుటుంబం ఉందని... తమకి ఏమైనా ప్రమాదం హాని జరిగితే, కుటుంబం అంతా బాధపడాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 15:** గార్ల మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక సమీప స్థలంలో బుధవారం గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ మాజీ సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ లు పట్టణ ప్రముఖులు, గ్రామస్తుల సమక్షంలో వేద పండితులు రామశాస్త్రి ఆధ్వర్యంలో శా స్త్రోక్తంగా ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ పార్వతి మాట్లాడుతూ ధర్మశాస్త్ర పీఠం అయ్యప్ప మాల ధారణ స్వాముల అభ్యర్థన మేరకు అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని ఈ ఆలయాల నిర్మాణంతోనే ఆధ్యాత్మిక, భక్తిభావం పెరుగుతుందన్నారు. దైవచింతన మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎండి జరీనా బేగం వార్డు సభ్యులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ తోడేటి శ్రీనివాస్ ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు హతీరాం నాయక్ చిన్న బంజర తండ సర్పంచ్ మోతిలాల్ టౌన్ ప్రెసిడెంట్ పళ్ల నరసయ్య షేక్ యాకుబ్ పాషా కోల కుమార్ ధర్మశాస్త్ర పీఠం గురు స్వామి దుర్గారావు కొండల్ రెడ్డి విజయ రాముడు రవీందర్ ఉపేందర్ రవీ తదితరులు పాల్గొన్నారు.



# బస్సును ఢీకొన్న ఆటో.. డ్రైవర్ కి గాయాలు

**వర్ధన్నపేట, ఏప్రిల్ 15పెన్ పవర్,** వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ సత్యనారాయణ కాజీపేట వైపు వెళుతుండగా, హైదరాబాద్ వెళ్తున్న బస్సు వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సత్యనారాయణ ఆటోలో ఇరుక్కుపోయి, అతని ఎడమ కాలు పూర్తిగా విరిగిపోయింది. సమాచారం అందిన వెంటనే 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని, సుమారు అరగంట పాటు శ్రమించి, ఇరుక్కుపోయిన ఆటో నుండి క్షతగాత్రుడిని బయటకు తీశారు. అనంతరం అతన్ని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

## వరి పంటను పరిశీలించిన అధికారులు



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 15:**గార్ల మండల పరిధిలోని రాంపురం గార్ల గ్రామాలలో వరి పంటలను బుధవారం మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు ఇరిగేషన్ అధికారి వంశీలు రైతులతో కలిసి పరిశీలించారు అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి నాట్లు జనవరి మొదటి వారం నుండి మూడో వారం వరకు జరిగాయని ప్రస్తుతం వరి పంట ఈనిక దశ నుండి గింజ గట్టిపడే స్టేజిలో ఉందని పంట కోతకు మరో 15 రోజుల నుండి 20 రోజుల వరకు పట్టే అవకాశం ఉన్నందున ఈ దశలో నీరు చాల అవసరమని మున్నేరు పరివాహక ప్రాంతంలో ఒకటి నుండి రెండు నీటి తడుల అవసరం ఉందని మున్నేటిలో చుక్కనీరు లేకపోవడంతో చేతికి అందివచ్చిన పంటలు దెబ్బతింటాయని నీటి కొరత తీర్చేందుకు సంబంధిత జిల్లా ఇరిగేషన్ ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వారు తెలిపారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ






**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 15:** రహదారి భద్రత జీవితానికి రక్షణ అని ప్రిన్సిపాల్ పసుపులేటి రమేష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ గార్ల ఎస్ఐ సాయికుమార్ ఆదేశాల మేరకు బుధవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక విశ్వశాంతి విద్యాలయంలోఅరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వ్యాసరచన పోటీలను నిర్వహించారు అనంతరం ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ రోడ్డుపై చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని రహదారిపై వెళ్లే సమయంలో విద్యార్థిని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడప రాదని , వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. అత్యధిక రోడ్డు ప్రమాదాల్లో భారతదేశం అగ్రస్థానంలో ఉందని , దాన్ని తగ్గించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ జావేద్ మృతి పట్ల మంత్రి పొంగులేటి తీవ్ర దిగ్భ్రాంతి

- నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని ప్రకటన



**ఖమ్మం రూలర్, పెన్ పవర్, 15:** ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ దుర్మరణం పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.సూర్యాపేట జిల్లా మోతే వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జావేద్ మరణించారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి పేర్కొన్నారు. ఖమ్మం రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జావేద్, పార్టీ కోసం నిరంతరం అంకితభావంతో పనిచేశారని మంత్రి కొనియాడారు. ప్రజా సమస్యలపై స్పందించే గుణం, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే నేర్పు కలిగిన నాయకుడు జావేద్ అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ శ్రేణులకు తీరని లోటని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. జావేద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని మంత్రి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 15:**గార్ల మండల పరిధిలోని సీతంపేట గ్రామపంచాయతీ గ్యామా తండా గ్రామానికి చెందిన భానోత్ ఈర్య మా గురించి బయట వారికి ఎందుకు చాడీలు చెప్తున్నావని అదే గ్రామానికి చెందిన బాసుపై చెంపల మీద చేతులతో కొడుతున్న తరుణంలో తన భార్య లక్ష్మి వచ్చి ఎందుకు కొడుతున్నావు అని అతనిని అడగగా ఆమెను కూడా నెట్టివేసి ఇంకోసారి మా గురించి చాడీలు చెప్తే చంపుతానని బెదిరించారని బానోతు బాసు పోలీస్ స్టేషన్ కు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం వెంటనే బాధితుడి ఇంటికి వెళ్లి అతని వద్ద నుండి దరఖాస్తు స్వీకరించి దాడి చేసిన ఈర్యపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

# అగ్నిమాపక సిబ్బంది నీటి విన్యాసాలతో ఆకట్టుకున్నారు

**బోథ్, ఏప్రిల్ 15 పెన్ పవర్:** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో ఫైర్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో సిబ్బంది రోడ్లపై చేపట్టిన నీటి విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రమాదాలు జరిగిన వెంటనే 101 కు కాల్ చేయాలని, 24/7 అగ్నిమాపక శాఖ సిద్ధంగా ఉంటుందని వారు తెలిపారు.

## ప్రజా పాలన సదస్సులు: కలెక్టర్ ఆదేశాలు



**ఆదిలాబాద్, ఏప్రిల్ 15 పెన్ పవర్:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' మండల స్థాయి సదస్సులను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గూగుల్ మీట్ లో దిశానిర్దేశం చేస్తూ, సదస్సుల్లో పోషణ్ మాస్ స్టాల్స్, గర్భిణీలకు సీమంతాల కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బాల్య వివాహ రహిత పంచాయతీలుగా తీర్మానం చేసిన గ్రామాలకు గుర్తింపునివ్వాలని తెలిపారు.

## ఖానాపూర్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాలు

**ఖానాపూర్, ఏప్రిల్ 15 పెన్ పవర్:** ఖానాపూర్ పట్టణ కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్సై రాహుల్ గైక్వాడ్ వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వాహనదారులతో కలిసి మానవహారం నిర్వహించి, వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. మైనర్లు వాహనాలు నడపరాదని ఆయన స్పష్టం చేశారు.

## అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగిన నిర్మల్

**నిర్మల్, ఏప్రిల్ 15 పెన్ పవర్:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ కాలనీలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో "విషు పూజ" కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామివారికి పంచామృతాలతో అభిషేకలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో కాలనీ పరిసర ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గత 16 సంవత్సరాలుగా అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఈ విషు పూజ కార్యక్రమం కొనసాగుతుంది.

## వడ దెబ్బతో కుప్పకూలిన వ్యక్తి

**ముథోల్, ఏప్రిల్ 15 పెన్ పవర్:** బెల్లంపల్లి మండలం పెర్కపల్లికి చెందిన గోడిశేల పోశం (60) తీవ్ర ఎండ ధాటికి వడదెబ్బకు గురై స్పృహ కోల్పోయారు. జ్వరం, విరేచనాలతో బాధపడుతున్న వృద్ధుడిని కుటుంబసభ్యులు గమనించి 108కు సమాచారం అందించారు. ఈఎంటీ రాకేశ్, పైలెట్ పూర్ణచందర్ వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని, ప్రాథమిక చికిత్స అందించి బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# దళితులపై అణచివేత నివారణకు కమిటీ సమావేశాలు




**హుజూరాబాద్, ఏప్రిల్ 15( పెన్ పవర్:** దళితులపై అణచివేత ఘటనలను నివారించేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సమావేశాలను ప్రతి మూడు నెలలకోసారి నిర్వహిస్తామని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. కరీంనగర్‌లోని కోర్టు సమీపంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి సభలో ఆమె మాట్లాడుతూ, దళితుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి తక్షణ పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా ప్రత్యేక కృషి జరుగుతోందని ఆమె వెల్లడించారు.

## రహీంఖాన్‌పేట యువ క్రీడాకారులకు టీ-షర్ట్స్ పంపిణీ

**కరీంనగర్, ఏప్రిల్ 15 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలో , 14 ఏప్రిల్ 2026న, కేసీఆర్ కప్పు టోర్నమెంట్ సందర్భంగా యువ క్రీడాకారులకు ఉప సర్పంచ్ గడ్డమీద పద్మ టీ-షర్ట్స్ పంపిణీ చేశారు. యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, పోటీతత్వాన్ని పెంచుతాయని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు అందుకున్న అక్కెనపల్లి కరుణాకర్

**మానకొండూరు, ఏప్రిల్ 15 పెన్ పవర్:** బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి కరుణాకర్, 16 ఏళ్లుగా దళిత, బహుజన, తెలంగాణ ప్రజా ఉద్యమాల్లో కృషి చేసినందుకు గాను మహనీయుల తెలంగాణ రాష్ట్ర ఉత్సావ కమిటీ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ 135వ జయంతి సందర్భంగా హైదరాబాదులో దళిత రత్న అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పలువురు కరుణాకర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అదే జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారు

**హైదరాబాద్ పెన్ పవర్:** నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉందని, డీలిమిటేషన్ తర్వాత ఇది అలాగే ఉండాలని అన్నారు. బీజేపీ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచుతామని కిషన్ రెడ్డి చెబుతున్నారని, కానీ డీలిమిటేషన్ బిల్లులో ఆ అంశమే లేదని అన్నారు. కిషన్ రెడ్డి చెప్పిన ప్రకారం అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, 17 లోక్ సభ స్థానాలకు 26 పెరుగుతాయని చెప్పారని తెలిపారు. కానీ బిల్లులో ఈ పెరుగుదల లేదని అన్నారు. బీజేపీ ఎప్పుడూ తెలంగాణకు మిత్రుడు కాదని విమర్శించారు. 2014 ఏపీ పునర్విభజన బిల్లులోనే సీట్ల పెంపు హామీ ఉందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ అనుకూలమేనని, కానీ డీలిమిటేషన్ బిల్లులో మాత్రం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

# ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్



**షాద్‌నగర్, ఏప్రిల్ 15 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని శివ మారుతి గీత అయ్యప్ప స్వామి దేవాలయంలో విష్ణు పూజ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, ఆలయ కమిటీ చైర్మన్ లష్కర్ ఆంజనేయులు, కూచూరి ప్రవీణ్, మార్గం రాజేష్ రాఘవేందర్, లక్ష్మీపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నాటకరంగంలో స్థానం వారి వైశిష్ట్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్ర నాటక రంగ చరిత్రలో నరసింహారావుది ప్రత్యేక స్థానం. నాటక రంగం మనగలిగినంత కాలం ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. ఆయన స్త్రీ పాత్రధారణలో అసాధారణ ప్రజ్ఞ కనబరచి నాటక రంగానికే వన్నె తెచ్చారు. పురుషులే స్త్రీ వేషాలు వేసే ఆ నాటి రోజుల్లో రంగస్థలంపై విభిన్నమైన, పరస్పర విరుద్ధ మయిన పాత్రలను ధరించి, ధరించిన ప్రతి పాత్రలోను తమదైన ప్రత్యేకతను చూపించి లీనమై, ముప్ఫయి సంవత్సరాలపాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ప్రతిభ ఆయనకే సొంతం. నటకావతంస, నటశేఖర, నాటకకళా ప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదులు, పురస్కారాలు ఆయనను వరించాయి. స్థానం నరసింహారావు (సెప్టెంబర్ 23, 1902 – ఫిబ్రవరి 21, 1971) ప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటులు. సత్యభామ, చిత్రాంగి మొదలైన అనేక స్త్రీ పాత్రలను సుమారు 40 సంవత్సరాలకు పైగా ధరించి 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకాభిమానంతో సహా పద్మశ్రీ పురస్కారం పొందాడు. స్థానం నరసింహారావు 1902, సెప్టెంబర్ 23 న హనుమంతరావు, ఆదెమ్మ దంపతులకు గుంటూరు జిల్లా బాపట్ల లో జన్మించారు. ఆయన చిన్నతనంలో కూచిపూడి భాగవతులు వచ్చి బాపట్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో వెంపటి వెంకటనారాయణ అనే ఆయన భామ వేషం అద్భుతంగా కట్టేవారట. ఆ స్త్రీ వేషం తన మనసులో ఎంతో ఆదరంతో మనసులో నిలిచి పోయి ఉండేదని చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఆయన రంగస్థల ప్రవేశం చేయడానికి దోహ దం చేశాయి. 1921లో బాపట్లలోనే జంటకవులైన తిరుపతి వేంకట కవులకు, కొప్పరపు కవులకు శతావధానం పోటీ జరిగింది. నెగ్గిన తిరుపతి వేంకటకవులని సత్కరిం చాలని భావించారు. ఆ సందర్భం గా ప్లీడరు గుమస్తాల బృందం చేత సత్య హరిశ్చంద్ర నాటకం వేయించాలని నిర్ణయించారు. ఆహ్వానాలు వెళ్లిపోయాయి. కానీ చంద్రమతి వేషధారి అస్వస్థుడై రాలేకపోతున్నట్టు చివరి నిమిషం లో తెలిసింది. ప్రత్యామ్నాయం ఏదీ సాధ్యం కాలేదు. చంద్రమతి పాత్రధారి మరొకరు దొరకలేదు. మరో నాటకం వేద్దామంటే పాత్రధారులంతా లేరు. గుండెల్లో రాయిపడింది. అప్పుడే ఆపద్బాంధవుడిలా స్థానం దొరికాడు చోర గుడి హనుమంతరావుకి. వారి నాటకం రిహార్సల్స్ జరుగు తున్నప్పుడు వెళ్లి కూర్చోవడంతో పద్యాలన్నీ వచ్చేశాయి. ఒకసారి ఎవరూ లేనప్పుడు పాడుకుంటూ ఉంటే హనుమంతరావు విన్నారు. ఆ ధైర్యంతోనే చంద్రమతి వేషం వేయించారు. స్థానం వారికి చిన్న తనంలోనే చిత్రలేఖనం కూడా అబ్బింది. ఆ కళతోనే, వేరే ఒకరి ఇంట రహస్యంగా తన వేషం తనే వేసుకున్నారాయన. చిన్న చిన్న లోపాలు ఉన్నా అరంగేట్రంలోనే తిరుపతి కవుల ఆశీస్సులు అందుకున్నారు స్థానం. తెనాలిలోని శ్రీరామ విలాస సభలో ప్రవేశించి ఆకాలంలోని గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతటా పర్యటించి అపారమైన అనుభవం సంపాదించారు. వరంగల్‌లో 'కృష్ణలీల' నాటకంలో యశోద వేషం వేసినందుకు ఆయన జీవితంలో తొలి బంగారు పతకం వచ్చింది. అనతికాలంలోనే ఆయన పేరు మారుమోగి పోయింది. కాపురం బాపట్ల నుంచి తెనాలికి మారింది. "శ్రీరామవిలాస సభ" అనే నాటక సమాజాన్ని స్థాపించి నటననే జీవికగా చేసుకున్నారు. రోషనార (రోషనార నాటకం), తామినా (రుస్తుం సొహరాబ్ నాటకంలో), సంయుక్త (రాణీ సంయుక్త), శకుంతల (అభిజ్ఞాన శాకుంతలం), సత్యభామ (శ్రీకృష్ణ తులాభారం), చిత్రాంగి (సారంగ ధర), దేవదేవి (విప్రనారాయణ), కోకిల (కోకిల నాటకం), మల్లమ్మ (బొబ్బిలి), మధురవాణి (కన్యా శుల్కం), అనసూయ (అనసూయ నాటకం), మురాదేవి (చంద్రగుప్త), చింతామణి (చింతామణి), సుభద్ర (వీరాభిమన్య), సరళ (ఛత్రపతి శివాజీ), విద్యాధరి (కాళిదాసు), చండిక (చండిక నాటకం) వంటి పాత్రలు వేశారు. ఎన్ని పాత్రలు పోషించినా, ఆయన వేసిన సత్య భామ పాత్ర పోషణ న భూతో న భవిష్యతి. "మీర జాల గలడా నా యానతి" అన్న పాటకు ఆయన చేసిన గాత్రం, చూపిన అభినయం నాటక ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఆంధ్రదేశంలో దాదాపు 3,000 సార్లు రంగస్థలం మీద పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శృంగార రసాన్ని ప్రతిబింబించే రీతిలో సత్యభామ పాత్ర, ప్రణయానికి చిత్రాంగిగా, వీరరసాన్ని చిత్రించడంలో రోషనార నాటకంలో రోషనారగా, వలపుల చింతామణిగా, ప్రణయదేవతగా, భక్తురాలిగా, దేవదేవిగా, మధురాతి మధురమైన మధురవాణిగా నవరసాలు కలిగిన పాత్రలను ప్రతిభావంతంగా పోషించాడు. వేషధారణ, వస్త్రాలంకరణలో స్థానం వారిది ఒక ప్రత్యేకత. రకరకాల చీరకట్టు సొగసులతో మనోహరంగా రంగస్థానం మీదకు ప్రవేశించి ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేశారు. వీరు సినీ రంగంలో రాధాకృష్ణ (1939), సత్యభామ) వంటి కొన్ని సినిమాలలో నటించారు. 1931 నుండి 1942 వరకు మద్రాసులో సినీనటుడిగా వున్నారు. ఆయన పాడిన పాటలు, పద్యాలు గ్రామ ఫోన్ రికార్డులుగా వచ్చి శ్రోతల్ని ఎంతగానో అందించాయి. తన నటనానుభవాలను చేర్చి "నట స్థానం" అనే గ్రంథాన్ని ఆయన రచించారు. స్థానం నరసింహారావు 1971 ఫిబ్రవరి 21 తేదీన మరణించారు. 1956లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ఈ బహుమతిని పొందిన తొలి ఆంధ్రుడు, కళాకారుడు. ఆయన రంగ స్థలం పై చూపించిన సమయ స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠం కూడా పెట్టింది. అయన నటనకు ముగ్ధులైన రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు.

# చరమాంకంలో తెలుగు నాటక రంగం

**హైదరాబాద్ పెన్ పవర్:** 19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శిపం చేశారు. తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోద ప్రదేశమే కాదు; వివిధ సంస్కృతుల్నీ. జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ.నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసు కోవచ్చు. తెలుగు దేశంలో ఆధునిక నాటక రచన ప్రదర్శనలకు దారితీసిన వారు పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు ఆధునిక తెలుగు నాటక రచనా ప్రారంభ విషయాన ప్రథములు. కందుకూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధునిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు. ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభంకాగా నాటక ప్రదర్శన మాత్రం 1880 లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన"మంజరీ మధుకరీయము". 'ఆంధ్రా జాన్సన్ 'గా సుప్రసిద్ధులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన "నరకాసుర విజయము" అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలము"ను ఆంధ్రీకరించడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని "సీజరు చరిత్రము" అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు. ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడు రూపకర్తలు. వీరేశలింగం సంభాషణ రూపాన "బ్రాహ్మ వివాహము" అను ప్రహసనమును తన "హాస్య సంజీవని" అను పత్రికలో రచించగా, అనంతరం "వ్యవహార ధర్మబోధిని" వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి "రత్నావళి", "చమత్కార రత్నావళి" అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగునాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే. ఆయన స్వతంత్ర రచన అయిన "వ్యవహార ధర్మబోధిని", సంస్కృత నాటక అనువాదమైన "రత్నావళి", ఆంగ్ల నాటక అనుసరణ అయిన "చమత్కార రత్నావళి" ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880 లో జరిగింది. అందుచేత 1980 వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది. తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడు వలె గానం కాదు) ప్రవేశపెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. వీరి నాటకాలలో ప్రసిద్ధమై, "వేణీ సంహారము". తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884-86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయ వంతంగా ప్రదర్శించారు. పాత్రోచిత భాష, అనుప్రాసయుక్తము ప్రాబంధికము అయిన శైలి ఆయన పాటించిన అంశాలు. పాటలు (టపాలు) పాడుట ఇతడు ప్రవేశపెట్టిన క్రొత్త అంశము. ఈ మూడు అంశాలు కాలక్రమంలో తెలుగు నాటక రంగం మీద ప్రాధాన్యం వహించాయి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు వారు తన తొలి తెలుగు నాటకమైన "చిత్రనళీయం"ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయవంతంగా ప్రదర్శించారు. రామకృష్ణమాచార్యులవారు 30 నాటకాలు రచించారు. అన్నీ స్వతంత్ర రచనలే. తన నాటకాలలో పాటలు ప్రవేశ పెట్టారు. పద్యాలను రాగయుక్తంగా పాడడం కూడా ప్రవేశ పెట్టారు. అయన "సారంగధర" తెలుగులోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్య-పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే "ఆంధ్ర నాటక పితామహ" అని బిరుదునిచ్చి సత్కరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా, అయన నాటకాలలో "గయోపాఖ్యానం" సుప్రసిద్ధమైనది. 1891లో " వెంకట రాయశాస్త్రి రచించిన "ప్రతాపరుద్రీయం" బహుళ ఖ్యాతినొందింది.1887లో ప్రకటితమైన గురజాడ అప్పారావుగారి "కన్యాశుల్కం" వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరంలోని జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. "ప్రతాపరుద్రీయం", "కన్యాశుల్కం" రెండు రాత్రుల రూపకాలు కాగా 1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీనివాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడంచేత "చారిత్రక నాటక పితామహుడు"గా పేరొందారు. ఆయన నాటకాలలో "కర్ణాటక రాజ్యనాశము" లేదా "రామరాజు చరిత్రము"నకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘవ. పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు రచించిన తొలి నాటకం "నర్మదాపురుకుత్సీయము" 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో "రాధాకృష్ణ", "పాదుకాపట్టాభిషేకం", "కంఠాభరణము" ప్రసిద్ధమైనవి. " 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగుదేశంలోని అన్ని ప్రాంతాలకూ వ్యాపించాయి. 1906-20 మధ్య కాలంలో బయల్దేరిన "హరిశ్చంద్ర" నాటకాలు 13. "సారంగధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల ప్రభావం వల్ల నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగుదేశంలో వ్యాపార నాటకరంగం విజృంభించడం. 1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశమంతటా వ్యాపించాయి. "గయోపాఖ్యానం", "పాండవ ఉద్యోగ విజయములు", "బొబ్బిలి యుద్ధం", "రంగూన్ రౌడి" మొదలగు నాటకాలకు విడివిడిగా పోటీలు జరిగాయి. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు తెనాలిలో స్థాపించబడింది. 1930 నుంచి సాంఘిక నాటకోద్యమం విజృభించింది. "విశ్వశాంతి", "ఎన్.జీ.ఓ.", "మా భూమి", "కీర్తిశేషులు", "నిర్మల" "కుక్క" వంటి నాటక రచనల ద్వారా రచయితలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. 1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి అభివృద్ధి చెందింది. కాళ్ళకూరి నారాయణరావు రచించిన "చింతామణి", "వరవిక్రయం", "మధుసేవ" సమస్యల ఆలంబనగా వెలసిన నాటకాలు. ఇలా వుండగా సంప్రదాయాల ఆధిక్యాన్ని రూపుమాపడం కోసం రచనలు చేసినవారు త్రిపురనేని రామస్వామి, ముద్దుకృష్ణ, గుడిపాటి వెంకట చలం, ఆమంచర్ల గోపాలరావు మొదలగువారు. ఈ కాలంలో దువ్వూరి రామిరెడ్డి గారి "కుంభరాణా", విశ్వనాథ సత్యనారాయణ "నర్తనశాల" ఉత్తమ విషాద రూపకాలు. 1930 తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన నాటకాలు కూడా వెలిశాయి. 1944-45 తరువాతి కాలాన్ని నాటక/నాటిక పోటీల యుగం అనవచ్చు. 1937 నుంచి రేడియో నాటికలు, 1944-45 నుంచి రంగస్థల ఏకాంకికలు పుంఖాను పుంఖాలుగా వెలువడు తున్నాయి. 1964లో ఎన్.ఆర్.నంది రచించిన "మరో మొహెంజొదారో" నాటకం ద్వారా తెలుగు నాటక ప్రయోగంలో "ఫ్రీజ్" ప్రవేశించింది. ఆ తరువాత లెక్కలేనన్ని ప్రయోగాలు ఆధునిక నాటకరంగాన్ని వరించాయి. సాంఘిక నాటకాలలో లేజర్ టెక్నిక్‌ను వాడడం ద్వారా సైంటిఫిక్ పోకడలను సైతం గ్రహించి ప్రదర్శించే అవసరం అనివార్యం అయింది.

# రాజ్యసభకు ఊహించని పేర్లు

**విజయవాడ, ఏప్రిల్ 14, పెన్ పవర్:** ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి ప్రారంభం అయింది. ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు రాజ్యసభ సభ్యులు జూన్ 21న పదవీ విరమణ చేయనున్నారు. అందుకే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వారి స్థానంలో కొత్త వారి ఎన్నికల కోసం నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధపడింది. కూటమికి ఏకపక్షంగా బలం ఉండడంతో.. వారి ఖాతాలోనే ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు పడనున్నాయి. అయితే ఆశావహులు చాలామంది ఉన్నారు. కానీ 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థుల ఎంపిక కు శ్రీకారం చుట్టింది కూటమి. అయితే అన్ని పార్టీల్లోనూ ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. కానీ ఈసారి కొత్త వారికి ఛాన్స్ ఇస్తారని ప్రచారం నడుస్తోంది. అదే సమయంలో సీనియర్లు సైతం పదవులు ఆశిస్తున్నారు.ఏపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వాని, సానా సతీష్ పదవి విరమణ చేయనున్నారు. అయితే ఇందులో సతీష్ టీడీపీకి చెందిన నేత. ఏడాది కిందట ఆయన రాజ్యసభకు ప్రమోట్ అయ్యారు. అప్పట్లోనే మరోసారి రెన్యువల్ ఇస్తామని టిడిపి నాయకత్వం హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు టిడిపికి రెండు.. జనసేన, బిజెపికి చెరో ఒక రాజ్యసభ పదవి ఇస్తామన్న ఒప్పందం పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన టిడిపికి రెండు పదవులు దక్కనున్నాయి. అందులో ఒక్కటి సానా సతీష్ కు ఖరారు అయింది. మిగతా పదవి కోసం పార్టీలో చాలామంది ఆశావహులు ఉన్నారు. అనూహ్యంగా భారత్ బయోటెక్



అధిపతి ఎల్లా కృష్ణా పేరు వినిపిస్తోంది. మరోవైపు గల్లా జయదేవ్ సైతం రేసులో ఉన్నారు. యనమల రామకృష్ణుడు తో పాటు వర్ల రామయ్య పేరు కూడా వినిపిస్తోంది. జూనియర్ల కోటాలో చింతకాయల విజయ్ సైతం రాజ్యసభ పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.జనసేనకు సంబంధించి అనేక పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే ఆది నుంచి ప్రముఖంగా వినిపించిన పేరు లింగమనేని రమేష్. ప్రముఖ పారిశ్రామిక వ్యాప్తంగా ఉన్న ఆయన 2024 ఎన్నికల్లో జనసేనకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. పైగా సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు కూడా. అయితే మరోవైపు అల్లు అరవింద్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. కానీ మొగ్గు మాత్రం లింగమనేని రమేష్ వైపు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పవన్ కళ్యాణ్ ఇష్టం పై ఆధారపడి ఉంటుంది. తొలి రాజ్యసభ పదవి జనసేనకు. అందుకే పవన్ కళ్యాణ్ ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.భారతీయ జనతా పార్టీ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందా అనే చర్చ నడుస్తోంది. అయితే రాష్ట్రం నుంచి ఆ పార్టీలో ఆశావహులు చాలామంది ఉన్నారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే ఏపీ నుంచి తమిళనాడు రాష్ట్రానికి చెందిన నేత అన్నామలైను రాజ్యసభకు పంపిస్తారన్న ప్రచారం ఉంది. ప్రస్తుత తమిళనాడు ఎన్నికల్లో అన్నామలై పోటీ చేయడం లేదు. అందుకే ఏపీ నుంచి రాజ్యసభ పదవి ఇచ్చి ఆయనను క్యాబినెట్ లోకి తీసుకుంటారన్న టాక్ నడుస్తోంది. మరోవైపు పారిశ్రామిక కోటాలో పరిమళ్ నత్వానికి మరో ఛాన్స్ ఉంటుందన్న ప్రచారం కూడా ఉంది. మరి ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయో చూడాలి.

# డీలిమిటేషన్ లెక్క ఇదేనా

**విజయవాడ, ఏప్రిల్ 15, పెన్ పవర్:** నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఏప్రిల్ 16న డీలిమిటేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. బిల్లులో చేసిన ప్రతిపాదన ప్రకారం దేశవ్యాప్తంగా ఎంపీ సంఖ్య 850కి పెరగనుంది. లోక్సభ సీట్లతో పాటుగా రాష్ట్రాలలో ఎమ్మెల్యేల సీట్లు కూడా పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో ఎన్ని అసెంబ్లీ, లోక్సభ స్థానాలు పెరుగుతాయనేదీ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 16వ తేదీన పార్లమెంట్లో ప్రవేశపెట్టనుండటంతో ఈ అంశం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశమైంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో చేసిన ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాలలో లోక్సభ స్థానాలను 815 వరకు పెరగనున్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లోని లోక్సభ స్థానాల సంఖ్య 35 వరకు పెరిగే అవకాశం ఉంది. దీంతో లోక్సభ స్థానాలు 543 నుంచి 850 వరకూ పెరగొచ్చని సమాచారం. ఇదే సమయంలో ఎంపీ సీట్లతో పాటుగా రాష్ట్రాలలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎమ్మెల్యే సీట్లు ఎంతకు పెరగవచ్చనేదీ ఆసక్తికరంగా మారింది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సామర్థ్యం ప్రస్తుతం 175గా ఉంది. అయితే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఏపీలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 175 నుంచి 263కు పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం ఉన్న స్థానాలకు 88 సీట్లు అదనంగా పెరగవచ్చని తెలుస్తోంది. అలాగే మొత్తం శాసనసభ స్థానాలలో 87 సీట్లు మహిళలకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. లోక్సభ స్థానాల విషయానికి వస్తే ఏపీలో ప్రస్తుతం ఉన్న లోక్సభ సీట్ల సంఖ్య 25. డీలిమిటేషన్ తర్వాత ఈ సంఖ్య 37 లేదా 38కి పెరగవచ్చని అంచనా. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే ఇందులో 12 నుంచి 13 ఎంపీ సీట్లు మహిళలకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.అలాగే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఏపీలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే స్థానాల సంఖ్య కూడా పెరగనుంది. ప్రస్తుతం ఏపీలో 29 శాసనసభ స్థానాలు ఎస్సీలకు రిజర్వ్ చేశారు. అలాగే ఎస్టీలకు7 శాసనభ స్థానాలు కేటాయించారు. తిరుపతి, చిత్తూరు, బాపట్ల, అమలాపురం లోక్సభ స్థానాలను ఎస్సీలకు, అరకు లోక్సభ సీటును ఎస్టీలకు రిజర్వు చేశారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఈ సంఖ్య పెరిగేందుకు అవకాశం ఉంది. అలాగే మంత్రిమండలి సంఖ్య కూడా 26 నుంచి 39కి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

# సింహాచలం భక్తుల భద్రత కోసం ఏఐ

**విశాఖపట్టణం, ఏప్రిల్ 14, పెన్ పవర్:** సింహాచలం అప్పన్న ఆలయంలో చందనోత్సవానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఏప్రిల్ 20న చందనోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత.. ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భక్తుల భద్రత కోసం తొలిసారిగా ఏఐ వినియోగించనున్నట్లు అనిత తెలిపారు. సీసీటీవీ కెమెరాల ద్వారా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.సింహాచలం చందనోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. సింహాచలం అప్పన్న ఆలయంలో ఏప్రిల్ 20వ తేదీన చందనోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అప్పన్న నిజరూప దర్శనం టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఆన్లైన్, ఆఫ్లైన్ పద్ధతులలో భక్తులకు నిజరూప దర్శనం టికెట్లు జారీ చేస్తున్నారు. చందనోత్సవానికి ఈ ఏడాది సుమారుగా రెండు లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. భక్తుల భద్రత కోసం సింహాచలం ఆలయంలో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించాలని అధికారులు నిర్ణయించారు.మరోవైపు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం పరిశీలించారు. ఈ ఏడాది సుమారు 2 లక్షల మంది భక్తులు స్వామివారి నిజరూప దర్శనం కోసం వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. సామాన్య భక్తుల దర్శనానికి పెద్దపీట వేయనున్నట్లు అనిత తెలిపారు. ఆరోజు తెల్లవారుజామున మూడు గంటల నుంచే సింహాచలం ఆలయంలో దర్శనాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భక్తుల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు తొలిసారిగా ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు వంగలపూడి అనిత వెల్లడించారు.అలాగే ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సింహాచలం కొండపై పది చోట్ల మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని.. నిరంతరాయంగా మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి అనిత తెలిపారు.రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. అత్యవసర సేవల కోసం ఎన్డీఆర్ఎఫ్ , ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, స్వామివారి నిజరూప దర్శనం , ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట?్ని హోం మంత్రి వివరించారు. సింహాచలం చందనోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.మరోవైపు చందనోత్సవం సందర్భంగా సింహాచలంలో గంధం అరగతీత కార్యక్రమానికి శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రాల సాక్షిగా ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఆలయ ఆచారం ప్రకారం గంధం అరగతీత కార్యక్రమం మూడు రోజులు కొనసాగుతుంది. గంధం అరగతీత కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు.

# పక్కా వ్యూహాలతో తమ్ముళ్లు..

**విజయవాడ, ఏప్రిల్ 15, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు అటాక్ అనేది ఆ పార్టీ స్ట్రాటజీ కాదు. రాజకీయ విమర్శలు వస్తే దానికి ధీటైన కౌంటర్ ఇవ్వడమే ఆ పార్టీ నేతలు చేసే పని. కానీఇటీవల పరిణామాలు చూస్తుంటే మాత్రం ముందే టిడిపి మంత్రులు అటాక్ చేయడం చూస్తుంటే మాత్రం ప్రత్యేక వ్యూహం ఉన్నట్టు అర్థమవుతుంది. జగన్ మావిగన్ రాజధాని ప్రతిపాదన తర్వాతరకరకాలుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. సరిగ్గా అదే సమయంలో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సెగలు పుట్టించాయి. అయితే ఆయన ఒక్కడే కాదు. ఆతరువాత మంత్రి పయ్యావుల కేశవ్. అటు తరువాత మంత్రి వంగలపూడి అనిత, చివరకు నిమ్మల రామానాయుడు.. ఇలా అంతా వరుసగా మీడియా ముందుకు వచ్చి సంచలన వ్యాఖ్యలు చేశారు.మునుపెన్నడూ లేని విధంగా టిడిపి మంత్రులు ఈ తరహా అటాక్ చేయడం వైసీపీకి నిద్ర పట్టడం లేదు.సాధారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువగా కౌంటర్ అటాక్ ఉంటుంది. దీనిపైనైనామూకుమ్మడి దాడి ఆ పార్టీ పుణ్యమే. అది వారికి అలవాటైన విద్య కూడా. కానీ టిడిపి మాత్రం అలాంటి విమర్శలు వచ్చినప్పుడు వాటికి సమాధానం చెప్పడమే. అదేపనిగా దానిని లాగి బయటకు ప్రచారంచేయడం ఉండదు. కానీ ఫస్ట్ టైం టిడిపి మంత్రులు అటాక్ చేయడం ప్రారంభించారు. తండ్రి అధికారం కోసం జగన్మోహన్ రెడ్డి ఎంత ఆరాటపడ్డారు.. ప్రస్తుతం వైసీపీలో



ఉన్న నేతలు కాంగ్రెస్ పార్టీలోఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పై ఏవిధంగా మాట్లాడారు అన్న విషయాలను గుర్తు చేస్తూ అచ్చెనాయుడు చేసిన కామెంట్స్ ఏపీ పొలిటికల్ వర్గాల్లో ప్రకంపనలు రేపాయి. తరువాత అదే స్థాయిలో మాట్లాడారు పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత. చివరకు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా హత్య గురించి ప్రస్తావిస్తూ వైసిపి పై విమర్శలు చేశారు.అయితే ఈ మొత్తం పరిణామాలతోమావిగన్ రాజధాని ప్రతిపాదన హైలెట్ అయింది. దానికి వ్యతిరేక ప్రచారం తోడైంది. వాస్తవానికి మావిగన్ పై వచ్చిన వ్యతిరేకతను.. అనుకూలంగా మార్చుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. మూడు నెలల పాటు దానికి టార్గెట్ పెట్టుకుంది. అదే పనిగా మావిగన్ ప్రచారం చేస్తే ప్రజల్లో క్రమేపి సానుకూలత వస్తుందని అంచనా వేసింది. కానీ ఈ విషయాన్ని గుర్తించిన టిడిపిమంత్రుల ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం మొదలు పెట్టింది. అలా ఆ కౌంటర్ పతాక స్థాయికి తీసుకెళ్లింది. మావిగన్ పై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామనుకున్న వైసీపీ ఆశలను గండి కొట్టింది. పక్కా వ్యూహంతోనే టిడిపి మంత్రుల కౌంటర్ అటాక్ అని అర్థమైంది.

# మతమార్పడులకు వ్యతిరేకంగా రఘురాముడి గళం

**ఏలూరు, ఏప్రిల్ 15, పెన్ పవర్:** ఏపీ రాజకీయాల్లో రఘురామకృష్ణం రాజు ప్రత్యేకంగా నిలుస్తున్నారు. గత ఏడేళ్ల పాటు ఆయన పేరు పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తూ వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా పార్లమెంట్ సభ్యుడయ్యారు. కొద్ది రోజులకే ఆ పార్టీని విభేదించారు. మొన్నటి ఎన్నికలకు ముందు టిడిపిలో చివరి నిమిషంలో చేరి ఉండి శాసనసభ టికెట్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యే గా గెలిచి డిప్యూటీ స్పీకర్ అయ్యారు. అయితే మతమార్పిడిల నిరోధం అనే అంశాన్ని తన రాజకీయ అజెండాగా మార్చుకున్నట్టు కనిపిస్తున్నారు. గతంలో ఎంపీగా ఉన్న సమయం నుంచి ఈ విషయంపై గళం ఎత్తారు ఆయన. ఇప్పుడు రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ క్షేత్రస్థాయిలో హిందూ ధర్మ రక్షణ, మతమార్పిడుల అడ్డుకట్ట దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన వివాదాస్పదం అవుతున్నారు.తన సొంత నియోజకవర్గంలో శ్రీరామనవమినాడు జరిగిన పరిణామాలు గురించి తెలిసిందే. శ్రీరాముడి విగ్రహానికి పూలమాలలు వేసేందుకు వెళ్తున్న ఆయనపై దాడి జరిగింది. అయితే దీనిని హిందుత్వవాదులు ముక్తకంఠంతో ఖండించారు. రాజకీయ పార్టీలు సైతం స్పందించాయి. ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్ప. అయితే ఈ రామాలయ వివాదాన్ని సీరియస్ గా తీసుకున్న రఘురామకృష్ణంరాజు తన అజెండాను అమలు చేయడం ప్రారంభించారు. రాష్ట్రంలో వ్యవస్థీకృతంగా జరుగుతున్న మతమార్పిడులను రఘురామకృష్ణంరాజు మాఫియాగా అభివర్ణించారు. తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే పోరాటం చేయడం ప్రారంభించారు.రాష్ట్రంలో మతమార్పిడులు అనేవి గత కొన్నేళ్లుగా జరుగుతూ వచ్చాయి. పేదరికంతోపాటు అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని సాగుతున్న మార్పిడులపై రఘురామకృష్ణంరాజు గట్టిగానే దృష్టిపెట్టారు. గట్టి హెచ్చరికలు జారీచేశారు. అయితే రఘురామకృష్ణం రాజు రాజకీయ చర్యలను వ్యతిరేకించేవారు ఇప్పుడు ఈ మతమార్పిడిలపై ఆయన చేస్తున్న పోరాటంపై ఏం చేయాలో వారికి పాలు పోవడం లేదు. ఎందుకంటే భారతీయ జనతా పార్టీ విధానం కూడా అదే. పైగా కూటమి పార్టీలో రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారు రఘురామకృష్ణంరాజు. అయితే ఇప్పుడు ఈ మతమార్పిడులకు వ్యతిరేకంగా ఆయన తీసుకున్న గళం ఏపీలో విస్తరిస్తోంది. ప్రజల్లో ఆలోచన తెచ్చిపెడుతోంది. ఇప్పటివరకు రఘురామకృష్ణం రాజు అంటే రాజకీయ కోణంలో ఆలోచించిన వారే ఉండేవారు. అయితే రఘురామకృష్ణం రాజు పై కొంతమంది పాస్టర్లు బాహటంగానే వ్యాఖ్యానించడం ఆయనకు హిందూ సమాజంలో మద్దతు పెరిగేందుకు దోహద పడిందిమతమార్పిడుల విషయంలో మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని రఘురామకృష్ణంరాజు నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల తరహాలో ఏపీలో కూడా మతమార్పిడిల నిరోధక చట్టం తీసుకురావాలని డిమాండ్ ను రఘురామకృష్ణం రాజు బలంగా వినిపించడం ప్రారంభించారు. బలవంతంగా మతమార్పిడులను చేయడం, అందుకు ప్రలోభాలకు గురిచేయడం వంటి వాటిపై కఠినమైన చట్టాలను ప్రయోగించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇప్పటికే కూటమిలో కీలకంగా ఉన్నారు రఘురామకృష్ణంరాజు. పైగా రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారు. ఆపై కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ విధానం కూడా అదే. మరోవైపు రాష్ట్రంలో హిందూ ఓటు బ్యాంకు ను ఏకీకృతం చేయడంలో రఘురామకృష్ణంరాజు కీలక పాత్ర పోషిస్తున్నట్లు అర్థమవుతోంది. ఇది కూటమికి కలిసి వచ్చే అంశం గాను స్పష్టమవుతుంది. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై హిందూ వ్యతిరేక ముద్ర ఉంది.

# పాత, మోతలతో వైసీపీ నేతలు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 15, పెన్ పవర్:** సాధారణంగా రాజకీయాల్లో విమర్శలు కామన్. అయితే గతం మాదిరిగా సిద్ధాంతపరంగా పార్టీలో కొనసాగే వారు తక్కువ. కానీ ఒక పార్టీలో కొనసాగాలంటే ప్రత్యర్థి పార్టీ నేతపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయాలి. అటువంటి పరిస్థితి నేటి రాజకీయాల్లో కొనసాగుతోంది. అయితే ఇప్పుడు అదే నేతలకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని ఇద్దరు మాజీ మంత్రులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గతంలో వారు కాంగ్రెస్ పార్టీలో కొనసాగినప్పుడు జగన్మోహన్ రెడ్డి పై చాలా కామెంట్లు చేశారు. ఆయన పై వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. ఇప్పుడు ఆ విమర్శలను గుర్తు చేస్తూ టిడిపి కూటమి జగన్మోహన్ రెడ్డిని ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. అయితే జగన్మోహన్ రెడ్డికి మించి ఓ ఇద్దరు మాజీ మంత్రులు చాలా బాధపడుతున్నారు. వారే బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సమయంలో జగన్మోహన్ రెడ్డి పై ధర్మాన తో పాటు బొత్స చాలా వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీని విభేదించి వైసీపీ ఏర్పాటు చేసుకున్నారు జగన్. ఆ సమయంలో చాలామంది నేతలు జగన్ వెంట అడుగులు వేశారు. కానీ బొత్స తో పాటు ధర్మాన కాంగ్రెస్ పార్టీలో ఉండిపోయారు. ఎందుకంటే అప్పటికే ధర్మాన కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా వ్యవహరిస్తున్నారు. బొత్స సత్యనారాయణ అయితే పార్టీలో టాప్ 5 లో ఉండేవారు. పైగా ఉమ్మడి రాష్ట్రానికి పిసిసి అధ్యక్షుడిగా కూడా ఉండేవారు. అయితే ఈ ఇద్దరు నేతలు జగన్మోహన్ రెడ్డి పై చెయ్యని వ్యాఖ్యలు అంటూ లేవు. ఆయన వ్యాపారాలపై మాట్లాడారు. నేర ప్రవృత్తి పై వ్యాఖ్యలు చేశారు. దాదాపు వైసీపీ ఆవిర్భావం నుంచి 2014 ఎన్నికల వరకు ఈ ఇద్దరు నేతలు చేయని వ్యాఖ్యలు అంటూ లేవు.జగన్మోహన్ రెడ్డి వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి రంగంలోకి దిగింది. మేం చెప్పే కంటే.. వైసీపీలో ఉన్న బొత్స, ధర్మానలు చెప్పినవి ఇవి అంటూ పాత మీడియా క్లిప్పింగులు తీసి మరి చూపిస్తున్నారు టిడిపి నేతలు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాత క్లిప్పింగులు తీసి వీరి విమర్శలను మీడియా ముందు ప్రదర్శించారు. అయితే ఇక్కడ తెలుగుదేశం పార్టీకి ఒక లక్ష్యం ఉన్నట్టు కనిపిస్తోంది. జగన్ వైఖరి గురించి సొంత పార్టీ వారి అభిప్రాయం చెప్పించే ప్రయత్నం ఒకటి కాగా.. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై జగన్ అనుమానపు చూపులు చూసేలా చేయాలన్నది ప్రణాళికగా కనిపిస్తోంది. ఇలా ఎలా చూసుకున్నా ఇప్పుడు జగన్ కంటే ధర్మాన, బొత్స ఇరకాటంలో పడుతున్నారు. ఒకవేళ జగన్మోహన్ రెడ్డి దీనిని వ్యక్తిగతంగా తీసుకుంటే మాత్రం తమ పొలిటికల్ లైఫ్ క్లోజ్ అవుతుందని భయపడిపోతున్నారు. అనుచరుల వద్ద ఇదే మాటలు చెప్పి వణికిపోతున్నారు.

# దువ్వాడ స్థానంలో వాణికే అవకాశం

**విజయనగరం, ఏప్రిల్ 15, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేసింది. వ్యక్తిగత కుటుంబ వ్యవహార శైలితో పార్టీ ఆయనను దూరం పెట్టింది. అయితే ఆయన తిరిగి వైసీపీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి వర్కౌట్ అయ్యేలా లేవు. ధర్మాన సోదరులతో పాటు దాదాపు వైయస్సార్ కాంగ్రెస్ నాయకులంతా దువ్వాడ శ్రీనివాసుని వ్యతిరేకిస్తున్నారు. సామాజిక వర్గ కోణంలో చూపి తమ్మినేని సీతారాం ద్వారా ప్రయత్నాలు చేశారు దువ్వాడ. కానీ ఆ ప్రయత్నలేవి వర్కౌట్ కాలేదు. దీనికి తోడు దువ్వాడ శ్రీనివాస్ వాణి ఇప్పుడు వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తద్వారా దువ్వాడ శ్రీనివాస్ దూకుడుకు ఆమె బ్రేక్ వేసినట్టు కనిపిస్తున్నారు. జిల్లా పార్టీ పెద్దల ప్రోత్సాహంతోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన దువ్వాడ శ్రీనివాస్ వైసీపీ పెద్దలపై రగిలిపోతున్నట్లు సమాచారం.దువ్వాడ వాణి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఒక విధంగా వాణి కుటుంబం వల్లే దువ్వాడ శ్రీనివాస్ కు ఆ పేరు వచ్చింది. టెక్కలి ఎంపీపీ తో పాటు జడ్పిటిసి గా కూడా ఉన్నారు వాణి. మొన్నటి ఎన్నికల్లో ఆమెకు ముందుగా టికెట్ ప్రకటించారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరి నిమిషంలో దువ్వాడ శ్రీనివాస్ కు ఇచ్చారు. అయితే ఎన్నికల అనంతరం దువ్వాడ కుటుంబంలో రేగిన వివాదం గురించి అందరికీ తెలిసిందే. అప్పట్లోనే వాణి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దువ్వాడ శ్రీనివాస్ లాంటి వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. అయితే ఆ నిర్ణయం ఆలస్యంగా తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేశారు. అయితే తిరిగి పార్టీలోకి దువ్వాడ చేరుతానని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ధర్మాన సోదరులపై మాత్రం అనుచిత వ్యాఖ్యలు తగ్గించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో దువ్వాడ శ్రీనివాస్ కు చెక్ చెప్పేందుకు దువ్వాడ వాణి రంగంలోకి దిగారు.దువ్వాడ శ్రీనివాస్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన క్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు వాణికి అప్పగిస్తారని అంత ప్రచారం నడిచింది. కానీ అనూహ్యంగా పేరాడ తిలక్ కు ఇచ్చారు. అయినా సరే దువ్వాడ వాణి జిల్లా వైసీపీ పెద్దలతో మంచి సంబంధాలు నడుపుతూ వచ్చారు. అయితే టెక్కలిలో కింజరాపు అచ్చెనాయుడుకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిపారని.. దిష్టిబొమ్మను దహనం చేశారని పోలీసులు పేరాడ తిలక్ ను అరెస్టు చేశారు. ఆ సమయంలో వైసీపీ నేతలు టెక్కలిలో ఆందోళన
చేపట్టారు. పోలీస్ స్టేషన్ ఎదుట వాణి బైఠాయించారు కూడా. టెక్కలి వైసీపీలో మరోసారి దువ్వాడ శ్రీనివాస్ కు ఛాన్స్ ఇవ్వకూడదని.. ఆయనను తిరిగి పార్టీలో చేర్చకూడదని.. టెక్కలిలో తిలక్ ను గెలిపిస్తే
నామినేటెడ్ పోస్టు వాణికి ఇస్తామన్న ఆఫర్ తోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. ఆమె సైతం దువ్వాడ శ్రీనివాసును పొలిటికల్ గా క్లోజ్ చేయాలని గట్టి సంకల్పంతో ఉన్నట్లు సమాచారం. చూడాలి
మరి ఏం జరుగుతుందో.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## కాల్పుల విరమణ పొడిగింపు ఉండకపోవచ్చు: ట్రంప్




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని ఏబీసీ న్యూస్‌తో మాట్లాడుతూ తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు

## సముద్రంలో పడవ బోల్తా : 250 మంది గల్లంతు



అండమాన్ : అండమాన్ సముద్రంలో ఘోర ప్రమాదం జరిగింది. దక్షిణ బంగ్లాదేశ్‌లోని టెక్నాఫ్ నుంచి బయలుదేరిన పడవ మలేషియాకు వెళుతుండగా, సముద్రంలో పడవ బోల్తా పడటంతో 250 మంది గల్లంతయ్యారు. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ జాతీయులు ఈ పడవలో ఉన్నారు. బలమైన గాలులు, అల్లకల్లోలమైన సముద్రం, సామర్థ్యానికి మించి ప్రయాణించడమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయలుదేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. ఈ పడవ ఏప్రిల్ 4 న బంగ్లాదేశ్ నుంచి బయలుదేరినట్లు తెలుస్తుంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేషియాకు వలస వెళుతుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాటపడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

## బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసమే



న్యూఢిల్లీ : బిజెపికి అనుకూలంగా నియోజకవర్గాల పునర్విభజన చేసుకుని, 2029 ఎన్నికల్లో గెలవాలనే రాజకీయ లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లు తీసుకురావాలనుకుంటోందని, ఈ రాజకీయ ఎత్తుగడను ప్రతిపక్షం తిప్పికొట్టాలని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంపై ప్రభుత్వానికి నిజంగా శ్రద్ధ ఉంటే, లోక్ సభలో ప్రస్తుతం 543 సీట్లలో మహిళలకు సీట్లు రిజర్వ్ చేసేందుకు ఒక బిల్లు తీసుకురావాలని సిబల్ అన్నారు. "బిజెపి రాజకీయ ప్రయోజనం లేకుండా ఏమీ చేయదు. తమకు రాజకీయంగా ప్రయోజనం చేకూరితే తప్ప వారు ఏ బిల్లునూ తీసుకురారు. ఇది పశ్చిమ బెంగాల్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని తీసుకున్న చర్య అని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లో ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. "టిఎంసి, ఇతర పార్టీల ఎంపిలు అక్కడ ప్రచారం చేస్తారా? లేక ఇక్కడికి వస్తారా? ఒకవేళ 29వ తేదీ తరువాత ఈ అంశాన్ని చేపట్టి ఉంటే ఏం జరిగేది? ఈ ప్రక్రియలో తమకు రాజకీయ ప్రయోజనం ఉందని తెలిస్తే తప్ప బిజెపి ఏమీ చేయదు" అని ధ్వజమెత్తారు. "ఉత్తర భారతదేశంలో బిజెపి 238 స్థానాలకు గాను 127 గెలుచుకోగా, దక్షిణ భారతదేశంలో 130 స్థానాలకు గాను 29 గెలుచుకుంది. కాబట్టి బిజెపి ఉత్తరాదిన సీట్లను పెంచుకుని, పెద్ద వాటాను పొందాలని చూస్తున్నారు. ఈ వ్యత్యాసం బిజెపికి రాజకీయ ప్రయోజనాన్ని చేకూరుస్తుంది" అని అన్నారు.

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్..
## 40 నిమిషాల పాటు సంభాషణ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ఫోన్ చేశారు. వారిద్దరూ సుమారు 40 నిమిషాల పాటు ఫోన్‌లో సంభాషించుకున్నారు. యూఎస్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కోసం ఇస్లామాబాద్‌లో పాక్ ఆధ్వర్యంలో జరిగిన మధ్యవర్తిత్వ చర్చలు విఫలం అయిన తర్వాత వీరిద్దరూ ఫోన్‌లో సంభాషించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని ప్రధాని ఎక్స్‌లో పంచుకున్నారు. 'నా మిత్రుడు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాల్లో మా ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయమైన పురోగతిని మేము సమీక్షించాము. అన్ని రంగాల్లో మా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మేం కట్టుబడి ఉన్నాం' అని పేర్కొన్నారు.

# హంగేరీలో ముగిసిన ఓర్బన్ శకం



హంగేరీ రాజకీయాల్లో దశాబ్ద కాలానికి పైగా సాగిన విక్టర్ ఓర్బన్ శకానికి తెరపడింది. యువ నాయకుడు పీటర్ మాగ్యార్ ప్రభంజనంతో హంగేరీలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. తాజాగా జరిగిన హంగేరీ సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. గత 16 ఏళ్లుగా తిరుగులేని నాయకుడిగా ఉన్న విక్టర్ ఓర్బన్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు. 'టిస్టా' పార్టీకి చెందిన యువ సంచలనం పీటర్ మాగ్యార్ ఈ ఎన్నికల్లో విజయ కేతనంతో హంగేరీ రాజకీయాలను మలుపు తిప్పారు. హంగేరీలోని 199 స్థానాలు శాసనసభలో పీటర్ మాగ్యార్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. ఓట్ల లెక్కింపు తుది దశకు వచ్చేసరికి టిస్జా పార్టీ మూడింట రెండు వంతుల మెజారిటీతో ఏకంగా 138 స్థానాలను కైవసం చేసుకునే దిశగా దూసుకుపోతోంది. బుడాపెస్టోని డాన్యూబ్ నది ఒడ్డున చేరిన వేలాది మంది మద్దతుదారుల మధ్య మాగ్యార్ తన విజయాన్ని ప్రకటించారు. ఓర్బన్ ఓటమితో యూరోపియన్ యూనియన్ లో హంగేరీ వ్యవహరిస్తున్న వైఖరికి తెరపడనుంది. గతంలో ఉక్రెయిన్కు అందాల్సిన 90 బిలియన్ యూరోల (వి105 బిలియన్) రుణాన్ని ఓర్బన్ అడ్డుకున్నారు. ఇప్పుడు పీటర్ మాగ్యార్ అధికారంలోకి రావడంతో ఈ నిధుల విడుదలకు మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని సమాచారం. హంగేరీ తిరిగి యూరోపియన్ యూనియన్ లో చేరడం వల్ల రష్యా-ఉక్రెయిన్ యుద్ధ పరిణామాల్లో కూడా మార్పులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తన ఓటమిని అంగీకరిస్తూ ఓర్బన్ భావోద్వేగ ప్రకటన చేశారు.

# దిగ్బంధనం మొదలైంది!

## నౌకలను అడ్డుకుంటున్న అమెరికా బలగాలు

పశ్చిమాసియాలో తాజా పరిణామాలు మరోసారి ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని అనిశ్చితి నెలకొంది. అమెరికా-ఇరాన్ చర్చలు విఫలం కావడం, మరోవైపు హోర్ముజ్‌ను ఎలాగైనా తమ అదుపులోకి తెచ్చుకుంటామని, అందుకోసం ఆ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ట్రంప్ అన్నంతపనిచేశారు. చర్చల ప్రక్రియకు ముందే హోర్ముజ్ జలసంధి వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న అమెరికన్ బలగాలు ట్రంప్ ఆదేశాల మేరకు దిగ్బంధనానికి దిగాయి. . భారత కాలమానం ప్రకారం రాత్రి 7.30గంటలకు ట్రంప్ పెట్టిన గడువు ముగిసింది. ఆ వెంటనే అమెరికన్ నౌకాదళం పెద్ద సంఖ్యలో రంగంకి దిగింది. ఇరాన్ పోర్టులకు వెళ్లి. వచ్చే అన్ని నౌకలను అడ్డుకోవడం ప్రారంభించింది. ఇరాన్‌తో సంబంధంలేని ఇతర దేశాల పోర్టుల్లోకి వెళ్లి వచ్చే నౌకలను ఆపబోమని, ఇరాన్ పోర్టు వైపు వెళ్లడానికి ప్రయత్నించినా, అక్కడ నుండి రావడానికి ప్రయత్నించినా అడ్డుకుంటామని అమెరికా నౌకాదళం ప్రకటించింది. ఈ చర్యను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ బలగాలు దీనిని చట్ట విరుద్ధమైన చర్యగా, సముద్రపు దొంగతనం కిందకు వస్తుందని ప్రకటించాయి. ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని ప్రకటించాయి. అమెరికా
అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులో తాము అమలు చేస్తున్న దిగ్బంధనం వైపు ఇరాన్ నౌకలు, ఫాస్ట్ అటాక్ షిప్స్ వస్తే నాశనం చేస్తామని ప్రకటించారు. ఇరాన్‌కు చెందిన 158 నౌకలను అమెరికా దళాలు ఇప్పటికే ధ్వంసం చేశాయని పేర్కొన్నారు. మరోవైపు కాల్పుల విరమణ ఇంకా అమల్లో వుందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోమవారం ప్రకటించారు.

# కార్మిక హక్కులను కాపాడండి




న్యూఢిల్లీ : నొయిడా, గ్రేటర్ నొయిడా, గురుగావ్, ఎన్‌సిఆర్ ప్రాంతాల్లో కార్మిక లోకం సాగించిన ఆందోళనలు, నిరసనలపై ఉత్తరప్రదేశ్, హర్యానాల్లోని బిజెపి ప్రభుత్వాలు సాగించిన అత్యంత దారుణమైన అణచివేత చర్యలను సిఐటియు తీవ్రంగా ఖండించింది. ఇదేమీ పారిశ్రామిక వివాదం కాదని, కార్మికుల హక్కులను అణచివేయడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగం కార్పొరేట్ ప్రయోజనాలను సమర్థించుకునేందుకు బహిరంగంగా వ్యవహరించిన తీరని సిఐటియు విమర్శించింది. తమ చట్టబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న కార్మికులపై ముఖ్యంగా పారిశ్రామిక కార్మికులపై ఉధృతంగా అణచివేత చర్యలకు పాల్పడిన నేపథ్యంలో వారికి సంఘీభావాన్ని ప్రకటించాల్సిందిగా కార్మిక లోకానికి సిఐటియు పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని పారిశ్రామిక యూనిట్ల వద్ద, ఫ్యాక్టరీ గేట్ల వద్ద, పారిశ్రామిక క్లస్టర్లలో ఈ నెల 16న పెద్దఎత్తున నిరసన కార్యాచరణ చేపట్టాలని కోరింది. తమ తమ సంబంధిత సంస్థల్లో న్యాయమైన ఈ డిమాండ్లను లేవనెత్తాలని పేర్కొంది. శాశ్వత ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థ, అరకొర వేతనాలు, అమానవీయ పని పరిస్థితులు, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, రాష్ట్ర ప్రభుత్వ అణచివేత వైఖరికి వ్యతిరేకంగా ఎన్‌సిఆర్, హర్యానా (మనేసార్, పానిపట్, సోనిపట్), రాజస్థాన్ (భివాడి, నీమ్రానా, అల్వార్), గుజరాత్ (సూరత్, హజీరా), బీహార్ (బరౌని), ఇతర పారిశ్రామిక కేంద్రాల్లోని కార్మికులందరూ సమైక్యంగా, సమన్వయంతో ప్రదర్శనలు నిర్వహించాలని, గేట్ మీటింగులు పెట్టాలని, ఇతర రూపాల్లో సంఘీభావాన్ని ప్రకటించాలని సిఐటియు కోరింది. అరెస్టు చేసిన కార్మికులను, నేతలను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. వారిపై తప్పుడు కేసులను ఉపసంహరించాలని కోరింది. వెంటనే కార్మిక సంఘాలతో త్రైపాక్షిక చర్చలు జరపాలని డిమాండ్ చేసింది. పూర్తిస్థాయిలో చట్టపరమైన ప్రయోజనాలను అందించడంతోపాటు నెలకు రూ.26 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని కోరింది. కచ్చితంగా 8 గంటల పనిదినాన్ని పాటించాలని, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు అమలు చేయాలని డిమాండ్ చేసింది. అణచివేత చర్యలతో కార్మిక లోకం విచ్ఛిన్నమవదని అందుకు బదులుగా మరింత ప్రతిఘటనా శక్తిని మూటగట్టుకుని బలపడుతుందని హెచ్చరించింది.

## వీధుల్లోకి వచ్చి పోరాడుతాం
## డీలిమిటేషన్‌పై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ హెచ్చరిక



చెన్నై : నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో ఏకపక్ష నిర్ణయాలను బలవంతంగా రుద్దాలని చూస్తోందని, ఇదే జరిగితే తమ రాష్ట్రంలోని ప్రతిపౌరుడు వీధుల్లోకి వచ్చి పోరాడుతామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం నాడు సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియో పోస్టు చేశారు. ఈ నెల 16న కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనుందని, అయితే పశ్చిమ బెంగాల్, తమిళనాడులో ఎన్నికలకు ముందు ఈ సమావేశం ఉండటం గమనార్హమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల అశాస్త్రీయ పునర్విభజనను తాము ముందు నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నామని గుర్తు చేశారు. ఈ పునర్విభజన కారణంగా ప్రభావితమయ్యే రాష్ట్రాల ముఖ్య మంత్రులను, అలాగే ప్రధాన రాజకీయ పార్టీలను ఒకచోట చేర్చి, చెన్నైలో సంయుక్త కార్యాచరణ కమిటీ సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలపై ఈ పునర్విభజన ప్రక్రియ ప్రభావం ఉండదని ప్రధాని పార్లమెంటులో హామీ ఇవ్వాలని డిమాండ్ చేశామని ఈ సందర్భంగా ఆయన మరోమారు గుర్తు చేశారు. అయితే ఇంతవరకు దీనిపై ప్రధాని స్పందించలేదని స్టాలిన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశంపై చర్చించేందుకు ప్రధానితో అపాయింట్‌మెంట్ కోరినా..వారు పట్టించుకోలేదన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్షంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. తాము ఊరుకునేది లేదన్నారు. తమిళనాడు ప్రేక్షకపాత్ర పోషించదని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబం వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తుందన్నారు. ఇది బెదిరింపు కాదు అని, తుది హెచ్చరిక అని ఆయన పేర్కొన్నారు. ఈ పోరాటంలో తమిళనాడు ప్రజలు తప్పక విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# ఆర్థిక వ్యవస్థకు చమురు సెగ

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ హెచ్చరించింది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం భారత్‌కు పెను సవాలుగా మారనుందని ఈ నివేదికలో విశ్లేషించింది. ఒకవేళ 2026లో ముడిచమురు సగటు ధర బ్యారెల్‌కు 130 డాలర్ల మార్కును తాకితే.. భారత ఆర్థిక వృద్ధి రేటు ఏకంగా 80 బేసిస్ పాయింట్లు లేదా 0.80 శాతం మేర పడిపోయే ప్రమాదం ఉందని సంస్థ అంచనా వేసింది. పశ్చిమాసియా సెగ కేవలం ఇంధన ధరలకే పరిమితం కాకుండా సరఫరా గొలుసులో అంతరాయాల ద్వారా

గహాలు, కార్పొరేట్ సంస్థలు, బ్యాంకింగ్ రంగంపై కూడా ఒత్తిడి పెంచుతుందని ఎస్అండ్‌పి హెచ్చరించింది. ఈ చమురు షాక్ ప్రభావంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత కార్పొరేట్ రంగం భారీ నష్టాలను చవిచూడాల్సి రావచ్చు. ప్రధానంగా కంపెనీల నిర్వహణ లాభాలు 15 నుంచి 25 శాతం వరకు క్షీణించే అవకాశం ఉందని.. దీంతో సంస్థల రుణ భారం పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయని ఎస్అండ్‌పి విశ్లేషించింది. బ్యాంకింగ్ రంగం విషయానికి వస్తే ఆస్తుల నాణ్యత తగ్గి మొండి బకాయిలు 3.5 శాతానికి చేరవచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా రసాయన, రిఫైనింగ్, ఏవియేషన్ రంగాలు ఈ ధరల పెరుగుదల వల్ల నేరుగా దెబ్బతినే అవకాశం ఉంది. పెరిగిన దిగుమతి ఖర్చుల వల్ల కరెంట్



అకౌంట్ లోటు పెరగడమే కాకుండా రూపాయి విలువపై కూడా క్షీణత ఒత్తిడి పెరుగుతుందని నివేదిక పేర్కొంది. యుద్ధ తీవ్రత తగ్గి హార్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో రవాణా సాధారణ స్థితికి చేరుకుంటే 2027 నాటికి ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని పేర్కొంది.

# భారత వృద్ధి 0.8% తగ్గొచ్చు!




భారతదేశ పటిష్టమైన స్థూల ఆర్థిక పునాదులు.. దీర్ఘకాలం పాటు కొనసాగే చమురు ధరల షాక్ ప్రభావాన్ని తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ, 2026లో బ్యారెల్ ముడి చమురు సగటు ధర 130 డాలర్లుగా ఉంటే ఆర్థిక వృద్ధి 80 బేసిస్ పాయింట్లు (0.8 శాతం) తగ్గే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదిక అంచనా వేసింది. ఇదే జరిగితే 2026-27లో కార్పొరేట్ ఆదాయాలు (ఎబిటా) 15-25 శాతం వరకు క్షీణించొచ్చని తెలిపింది. మరోవైపు బ్యాంకింగ్ రంగ ఆస్తుల నాణ్యత బలహీనపడి, మొండి బకాయిలు 3.5 శాతానికి చేరొచ్చని పేర్కొంది. 'పశ్చిమాసియా యుద్ధం వల్ల కలిగే ప్రకంపనల ప్రభావానికి భారత్ అతీతం కాదు. పెరిగిన ఇంధన ధరలు, సరఫరా అంతరాయాల వల్ల కలిగే ఇబ్బందులు నెలల తరబడి కొనసాగొచ్చు. ఇది గృహాలు, కార్పొరేషన్లు, బ్యాంకుల ఆర్థిక కార్యకలాపాలను కుంటుపరుస్తుంద'ని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తన నివేదికలో వివరించింది. అయితే బలమైన కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు, మూలధనం మంచి స్థాయిలో ఉన్న బ్యాంకులు ఈ ప్రభావం నుంచి కొంత బయటపడే అవకాశం ఉందని వెల్లడించింది. సార్వభౌమ రేటింగ్‌పై తక్షణ ప్రభావం ఉండదు: స్ట్రెస్ కేసు కింద 2026లో బ్రెంట్ ముడి చమురు ధరను బ్యారెల్‌కు 130 డాలర్లుగా, 2027లో 100 డాలర్లుగా ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. బేస్ కేసులో ఈ ధరలు వరుసగా 85 డాలర్లు, 70 డాలర్లుగా ఉంటాయని తెలిపింది. ఆర్థిక స్థిరీకరణ ప్రయత్నాలకు తాత్కాలిక ఎదురుదెబ్బలు తగలవచ్చని భావిస్తున్నప్పటికీ, భారతదేశ సార్వభౌమ రేటింగ్‌పై తక్షణ ప్రభావం ఏదీ ఉండదని అంచనా వేస్తోంది. అధిక చమురు ధరలు కరెంట్ ఖాతా లోటును పెంచుతాయని తెలిపింది. బ్యారెల్‌కు 10 డాలర్ల పెరుగుదల ఈ లోటును జీడీపీలో 0.4 శాతం మేర పెంచొచ్చని తెలిపింది. సెంటిమెంటు బలహీనపడటం, పెరుగుతున్న దిగుమతుల బిల్లుల నేపథ్యంలో రూపాయి విలువ కూడా క్షీణించే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదికలో ప్రస్తావించింది.


# ఆటోకు వార్ దెబ్బ.. దేశీయ పరిశ్రమకు సవాళ్లేనంటున్న సియామ్

పశ్చిమాసియాను కుదిపేస్తున్న అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో దేశీయ ఆటోమోటివ్ పరిశ్రమకు తీవ్ర ఇబ్బందులే ఎదురుకావచ్చని మంగళవారం భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సమాజం (సియామ్) అధ్యక్షుడు శైలేష్ చంద్ర అన్నారు. వాహనాల డిమాండ్‌పై పరోక్ష ప్రభావం ఉండొచ్చని 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసిన నేపథ్యంలో ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. 'మిడిల్ ఈస్ట్ సంక్షోభం నుంచి తలెత్తిన అనిశ్చిత పరిస్థితులను నిశితంగా గమనించాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుత భౌగోళిక, రాజకీయ పరిస్థితులను చూస్తే.. ఆటోమోటివ్ ఉత్పాదకత చిక్కుల్లో పడవచ్చు. విడిభాగాల ధరలు, ఇంధన చార్జీలు, రవాణా ఖర్చులు సమీప కాలంలో ఆటో ఇండస్ట్రీకి సవాల్‌గా మారగలవనిపిస్తున్నది' అని చెప్పారు. గల్ఫ్ వార్‌తో భారతీయ ఆటో ఇండస్ట్రీకి ముడి సరుకుల కొరత రావచ్చని శైలేష్ హెచ్చరించారు. ముఖ్యంగా పెట్రో కెమికల్స్ తయారీలో వినియోగించే ప్రొపేన్, ఇథిలీన్ సరఫరాలో సమస్యలు ఏర్పడవచ్చని, అలాగే వాహనాలకు వేసే రంగుల తయారీ కూడా చిక్కుల్లో పడవచ్చన్నారు. తద్వారా మార్కెట్‌లో వాహనాల డిమాండ్ ప్రభావితం కావచ్చని పేర్కొన్నారు. వార్‌లో అమెరికా-ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆయా దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి దాదాపుగా బ్రేకులుపడ్డాయి. అంతేగాక గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హార్ముజ్



జలసంధిని ఇరాన్ ఇంచుమించుగా మూసివేయడంతో నౌకాయానం సమస్యల్లో పడింది. చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొనడంతో దూరం పెరిగి రవాణా సమయం, వ్యయం మితిమీరిపోతున్నదని శైలేష్ అంటున్నారు. అలాగే షిప్పింగ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. అంతిమంగా దిగుమతిదారులపైనే ఈ భారం పడుతుండగా.. ఇది ఆయా ఉత్పత్తుల ధరల పెరుగులకు దారితీస్తున్నది. ఈ క్రమంలోనే రాబోయే 4-5 వారాల్లో ఆయా కంపెనీలు వివిధ వాహనాల ధరల్ని పెంచే అవకాశాలూ లేకపోలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే పలు సంస్థలు ఆయా మాడళ్ల రేట్లను పెంచిన సంగతి విదితమే. కాగా, పెరిగే పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ తదితర ఇంధన ధరలతోనూ వాహనాల అమ్మకాలు పడిపోవచ్చన్న ఆందోళన ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నది.

# ఇరాన్ యుద్ధం వల్ల భారత్‌లో 25 లక్షల మంది పేదరికంలోకి



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పైన మరింత ప్రభావం చూపనున్నాయి. ఈ పరిణామాల వల్ల మనదేశంలో 25 లక్షల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోయే ప్రమాదం ఉందని, అలాగే మానవ అభివృద్ధి పురోగతిలో దేశం కొంత నష్టాన్ని చూడక తప్పదని ఐక్యరాజ్యసమితి అంచనాలు వెల్లడిస్తున్నాయి. 'మధ్యప్రాచ్యంలో సైనిక ఉద్రిక్తతలు: ఆసియా, పసిఫిక్ ప్రాంత మానవ అభివృద్ధిపై ప్రభావాలు' అనే శీర్షికతో ఐక్యరాజ్యసమితి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) విడుదల చేసిన నివేదికలో.. ఈ యుద్ధం అధిక ఇంధనం, రవాణా, ముడిసరుకుల ఖర్చుల ద్వారా ఆసియా, పసిఫిక్ ప్రాంతమంతటా మానవాభివృద్ధిపై ఒత్తిళ్లను పెంచుతోంది. ఇది దేశంలోని ప్రజల కొనుగోలు శక్తిని, ఆహార భద్రతను తగ్గిస్తోంది. ప్రభుత్వ బడ్జెట్లపై భారం మోపడమే కాకుండా, జీవనోపాధిని బలహీనపరుస్తోందని నివేదిక పేర్కొంది. ఇరాన్ యుద్ధ పరిస్థితుల తర్వాత దేశంలో పేదరికం రేటు 23.9 శాతం నుంచి 24.2 శాతానికి పెరుగుతుందని, దీనివల్ల 24,64,698 మంది ప్రజలు పేదరికంలోకి వెళ్తారని నివేదిక తెలిపింది. సంక్షోభానికి ముందు 35,15,69,000 మంది పేదరికంలో ఉండగా, సంక్షోభం తర్వాత దేశంలో ఈ సంఖ్య సుమారుగా 35,40,33,698కి చేరుతుందని నివేదిక అంచనా వేస్తోంది. మరోవైపు, ఈ యుద్ధ ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా కూడా 88 లక్షల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోయే ప్రమాదంలో ఉన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ఆసియా-పసిఫిక్‌కు 299 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ. 27.82 లక్షల కోట్ల) వరకు నష్టం వాటిల్లవచ్చు. చైనాలో పేదరికంలోకి జారిపోయే ప్రమాదంలో ఉన్న వారి సంఖ్య సుమారు 1,15,000 నుంచి 6,20,000కు పైగా పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది.

## షాకిచ్చిన బంగారం, వెండి ధరలు




బంగారం, వెండి ధరలు మళ్లీ ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. వరుసగా రెండో రోజు ఈ లోహాల ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ఉదయం 10 గంటలకు లైవ్ ట్రేడింగ్ లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1420 పెరిగి.. రూ.1,55,350కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1300 పెరిగి.. రూ.1,42,400 వద్ద కొనసాగుతోంది. ఇదే సమయంలో వెండి ధర కూడా భారీగానే పెరిగింది. కిలో వెండిపై ఏకంగా రూ.10,000 పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,75,000గా ఉంది. పెరిగిన ధరలపై జీఎస్టీ, తరుగు అదనంగా ఉండనున్నాయి. కాగా.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో స్వల్ప మార్పులుండొచ్చు. జూన్ వరకూ ఓ వైపు పెళ్లిళ్లు, మరోవైపు ఇతర శుభకార్యాలున్న వేళ.. బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునేవారికి పెరిగిన ధరలు భారమవుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి వారిలో బంగారం మళ్లీ అందని ద్రాక్షవుతుందా అన్న ఆందోళన మొదలైంది.

## గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి ఆరు రెట్లు పెరిగిన పెట్టుబడులు




పసిడి ధరలతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు సంప్రదాయ 'సురక్షిత ఆస్తి' బంగారంలో పెట్టుబడులకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే 2026, మార్చి త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు ఏకంగా 6 రెట్లు పెరగడమే దీనికి సాక్ష్యం. ముఖ్యంగా బంగారం ధరలు ఊహించని విధంగా రికార్డు గరిష్ఠాలకు చేరడంతో చిన్న మొత్తం గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్‌లు) కొనుగోళ్లు అత్యంత వేగంగా పెరిగాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి మొత్తం రూ. 31,561 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది గతేడాది మార్చి త్రైమాసికంలో వచ్చిన రూ. 5,654 కోట్ల కంటే దాదాపు ఆరు రెట్లు అధికం. త్రైమాసిక పరంగా కూడా అంతకుముందు డిసెంబర్ త్రైమాసికంలో రూ. 23,132 కోట్ల కంటే 36 శాతం పెరిగాయని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ (యాంఫీ) పేర్కొంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు పెరగడంతో గోల్డ్ ఫండ్ల ఆస్తులు గతేడాది రూ. 58,888 కోట్ల నుంచి మూడు రెట్లు పెరిగి రూ. 1.71 లక్షల కోట్లకు చేరింది.

## పశ్చిమాసియా శాంతి, స్థిరత్వానికి నాలుగు సూత్రాలను సూచించిన జిన్‌పింగ్

పశ్చిమాసియాలో శాంతి కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నాలుగు సూత్రాల రోడ్ మ్యాప్‌ను ప్రతిపాదించినట్లు చైనా అధికారిక మీడియా జిన్హువా నివేదించింది. పాకిస్తాన్ మధ్యవర్తిత్వం విఫలమైన తర్వాత చైనా నుంచి ఈ ప్రతిపాదన వచ్చింది. యుఎఇ రాజు చైనా పర్యటన సమయంలో జిన్‌పింగ్ ఈ ప్రతిపాదన చేశారు. మంగళవారం అబుదాబి యువరాజు షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో సమావేశమై నాలుగు సూత్రాల రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదించినట్లు చైనా మీడియా పేర్కొంది. ప్రాంతీయ శాంతియుత సహజీవనం, జాతీయ సార్వభౌమాధికారాన్ని గౌరవించడం, అభివృద్ధి-భద్రత సమన్వయం, అంతర్జాతీయ నియమాల ఆధారిత వ్యవస్థను పరిరక్షించడం వంటి నాలుగు సూత్రాలను జిన్‌పింగ్ ప్రతిపాదించారు. 'అంతర్జా తీయ చట్టబద్ధమైన పాలన అధికారాన్ని మనం కాపాడాలి. మనకు అనుకూలంగా ఉన్నప్పుడు దాన్ని వాడుకోవడం, అనుకూలంగా లేనప్పుడు వదిలేయడం కుదరదు. అలాగే, ప్రపంచం తిరిగి అరాచక పాలనలోకి జారిపోవడానికి మనం అనుమతించలేము' అని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలు, పాకిస్తాన్ మధ్యవర్తిత్వం విఫలమైన తర్వాత, జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు, వచ్చే నెలలో డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనకు వెళ్లబోతున్నారు. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## నైజీరియాలో విషాదం

నైజీరియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ప్రాంతంలోని యోబే రాష్ట్రంలో ఉగ్రవాదుల స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని సైన్యం జరిపిన వైమానిక దాడి మిస్ఫైర్ అయి వారపు సంతపై ఆ బాంబులు పడటంతో 100 మందికి పైగా గ్రామస్థులు ప్రాణాలు కోల్పోయారు. జిలి గ్రామంలో సంత జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకారం, ఈ దాడిలో కనీసం 100 మందికి పైగా మరణించగా, రాయిటర్స్ నివేదికల ప్రకారం సంఖ్య 200 దాటింది.. మృతుల్లో మహిళలు, పిల్లలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. నైజీరియా వైమానిక దళం తమ లక్ష్యం ఉగ్రవాదుల స్థావరం, లాజిస్టిక్స్ కేంద్రాలే నని, "ఖచ్చితమైన దాడి" జరిపినట్లు పేర్కొంది. అయితే, ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ మాజీ ఉపాధ్యక్షుడు అటికు అబుబకర్ ఈ దాడిని ఖండిస్తూ, ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈశాన్య నైజీరియాలో బోకో హరామ్, ఐఎస్ డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద చర్యలు గ్రూపుల పై సైన్యం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 2017 నుంచి సైన్యం చేసిన దాడుల్లో జరిగిన పొరపాట్ల కారణంగా వందలాది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఈ తాజా ఘటనపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది.

## మట్టికుండలో నీళ్లు మంచివే.. కానీ!



వేసవి కాలం రానే వచ్చింది, భానుడి భగభగలకు విరుగుడుగా ప్రతి ఇంట్లోనూ మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి. ఫ్రిజ్ నీళ్ల కంటే కుండలోని చల్లని నీరు ఆరోగ్యానికి ఎంతో మేలని మనందరికీ తెలుసు. అయితే మట్టి కుండను సరిగ్గా శుభ్రం చేయకపోతే ఆ నీరు ఆరోగ్యానికి హానికరంగా మారుతుందని తెలుసా? మట్టి కుండలోని నీరు సహజంగా చల్లబడటమే కాకుండా నీటిలోని మలినాలను వడపోస్తుంది. కానీ కుండలో బ్యాక్టీరియా చేరకుండా ఉండాలంటే దానిని నిర్వహించే విధానంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కొత్త కుండను వాడే ముందు నుండి దానిని నిత్యం ఎలా శుభ్రం చేయాలో ఇప్పుడు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. ఇంట్లోని మట్టి కుండ ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా ఉండాలంటే ఈ చిట్కాలు తప్పక పాటించండి. మార్కెట్ నుండి కొత్త మట్టి కుండను తెచ్చినప్పుడు దానిని నేరుగా వాడకూడదు. కుండను ఉపయోగించే ముందు కనీసం 24 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల మట్టిలోని సూక్ష్మ రంధ్రాలు మూసుకుపోయి నీరు లీక్ అవ్వకుండా ఉంటుంది. ఆ తర్వాత కుండను లోపల, బయట బాగా రుద్ది కడగాలి. మొదటిసారి వాడే ముందు కుండను ఎండలో పూర్తిగా ఆరబెట్టడం వల్ల అందులోని క్రిములు నశిస్తాయి. ఈ చిన్న ప్రక్రియ కుండ నాణ్యతను పెంచడమే కాకుండా నీటిని మరింత చల్లగా ఉంచుతుంది. కుండలో నీటిని 2 నుండి 4 రోజుల కంటే ఎక్కువ కాలం నిల్వ ఉంచకూడదు. నిల్వ ఉన్న నీటిలో బ్యాక్టీరియా, నాచు, దుమ్ము చేరే అవకాశం ఉంది, కొన్నిసార్లు పురుగుల లార్వాలు కూడా చేరవచ్చు. కాబట్టి ప్రతిరోజూ పాత నీటిని పారబోసి కొత్త నీటిని నింపుకోవడం మంచిది. కుండను క్రమం తప్పకుండా వేడి నీటితో కడగడం వల్ల క్రిములు చేరకుండా ఉంటాయి. కుండ మూతను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండాలంటే పరిశుభ్రమైన కుండ నీరు ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. మట్టి కుండను శుభ్రం చేసేటప్పుడు చాలామంది చేసే పెద్ద తప్పు సబ్బు లేదా డిటర్జెంట్లు వాడటం. మట్టికి పీల్చుకునే గుణం ఉంటుంది, కాబట్టి సబ్బులోని హానికరమైన రసాయనాలు కుండ రంధ్రాల్లోకి వెళ్లి మనం తాగే నీటిలో కలిసిపోతాయి. దీనికి బదులుగా వంట సోడా లేదా ఉప్పు ఉపయోగించి కుండను రుద్దవచ్చు. ఇవి సహజ సిద్ధంగా క్లీనింగ్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. లోతైన శుభ్రత కోసం నెలకు ఒకసారి వెనిగర్ కలిపిన నీటితో కుండను కడిగితే బ్యాక్టీరియా మరియు దుర్వాసన పూర్తిగా తొలగిపోతాయి.

## ఇలాంటి కల వచ్చిందా.. అయితే ఏం జరుగుతుందో తెలుసుకోండి..



మనం నిద్రపోతాం కానీ మన మనస్సు నిద్రపోదు. అది కలల రూపంలో మనకు అనేక సంకేతాలను పంపిస్తూనే ఉంటుంది. ఎప్పుడైనా కలలో అద్దం ముందు నిలబడి మిమ్మల్ని మీరు చూసుకుని భయపడ్డారా? లేదా పగిలిన అద్దం చూసి ఆందోళన చెందారా? అద్దం కనిపించే కలలు కేవలం యాదృచ్ఛికం కాదు.. అవి మీ మనసులోని లోతైన ఆలోచనలకు ప్రతిబింబాలు. నిద్రలో మనకు వచ్చే కలలు ఒక్కోసారి మనల్ని ఎంతో ఉత్సాహపరుస్తాయి. మరికొన్ని సార్లు తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తాయి. ముఖ్యంగా కలలో అద్దం ముందు నిలబడి మనల్ని మనం చూసుకోవడం అనేది చాలా మందికి ఎదురయ్యే అనుభవం. ఈ కల మన వ్యక్తిత్వం, భవిష్యత్తు, మానసిక స్థితి గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తుంది. కలలో అద్దం కనిపిస్తే, మీరు ఒకసారి మీ జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకోవాలని అర్థం. బహుశా మీరు తీసుకున్న ఏదైనా నిర్ణయం మిమ్మల్ని ఇబ్బంది పెడుతుండవచ్చు. మీ తప్పులను సరిదిద్దుకుని, ప్రవర్తనను మెరుగుపరచుకోవాలని మీ సబ్‌కాన్షియస్ మైండ్ మీకు ఇస్తున్న హెచ్చరిక ఇది. అద్దంలో మీ ముఖం స్పష్టంగా కాకుండా మసకగా లేదా భిన్నంగా కనిపిస్తే.. మీ జీవితంలో ఒక పెద్ద మార్పు రాబోతోందని అర్థం. ప్రస్తుతం మీరు ఏదో ఒక విషయంలో అయోమయంలో ఉన్నారని, మీ అసలు రూపాన్ని లేదా లక్ష్యాన్ని మీరు గుర్తించలేకపోతున్నారని ఇది సూచిస్తుంది. ఆధ్యాత్మికంగా చూస్తే, ఇది మీ ఆత్మకు సంబంధించిన లోతైన మార్పులకు సంకేతం. కలలో అద్దం పగిలినట్లు కనిపిస్తే అది శుభసూచకం కాదని చాలా మంది భావిస్తారు. మానసిక శాస్త్రం ప్రకారం.. పగిలిన అద్దం మీ లోని ఆత్మవిశ్వాసం లోపాన్ని లేదా మానసిక ఒత్తిడిని సూచిస్తుంది. మీ వ్యక్తిగత సంబంధాలలో సవాళ్లు ఎదురవుతున్నాయని లేదా ఏదైనా నిర్ణయం తీసుకోవడంలో మీరు తీవ్రమైన సంకోచంలో ఉన్నారని దీని అర్థం. తరచుగా ఇలాంటి కలలు వస్తుంటే, మీరు మీలోని భయాలను, అభద్రతా భావాలను లేదా దాగి ఉన్న కోరికలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అర్థం. సాధారణంగా మనం బయట ప్రపంచానికి చూపించని మన అసలు స్వభావాన్ని అద్దం ప్రతిబింబిస్తుంది. ఈ సంకేతాలను అర్థం చేసుకుని, లోపాలను సరిదిద్దుకుంటే వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉంటుంది. కలలు అనేవి మన ఆలోచనల ప్రతిరూపాలు. అద్దం కనిపించే కలలు మిమ్మల్ని మీరు మూల్యాంకనం చేసుకోవడానికి, మీ అంతరంగాన్ని శుద్ధి చేసుకోవడానికి ఒక గొప్ప అవకాశం అని గుర్తించండి.

## ఏసీ లేకుండా ఉండలేకపోతున్నారా..?

మనం ఎయిర్ కండిషనర్ నుండి బయటకు రాగానే మనకు ఊపిరాడనట్లు, గందరగోళంగా, ఆగమాగంగా అనిపిస్తుంది. దీనిని సాధారణంగా అలవాటుపడటం అని అంటారు. ఎందుకంటే కొంతమంది ఇప్పటికీ ఏసీ లేకుండానే జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ సందేహం కలుగుతుంది. వేసవి వచ్చేసింది. ఎండదలు దంచి కొడుతున్నాయి. దీంతో మనం నిరంతరం ఎయిర్ కండిషనర్లను పరుగులు పెట్టిస్తూనే ఉంటాము. దూరం నుండి సూర్యరశ్మిని చూడగానే మనకు వేడి అనిపిస్తుంది. మండే ఎండ గురించి ఆలోచిస్తేనే మనకు వణుకు పుడుతుంది. ఈ రోజుల్లో ఎయిర్ కండిషనింగ్ మన జీవితంలో ఒక అంతర్భాగంగా మారిందనడంలో సందేహం లేదు. ఇల్లు, ఆఫీస్, లేదా కారు, మనం ప్రతిచోటా చల్లని గాలికి అలవాటు పడ్డాము. అది లేకుండా జీవించడం అసాధ్యం అనిపిస్తుంది. పైగా సమ్మర్‌లో ఏసీ లేకుండా ఒక్క నిమిషం కూడా కష్టంగా అనిపిస్తుంది. మనం ఎయిర్ కండిషనర్ నుండి బయటకు రాగానే మనకు ఊపిరాడనట్లు, గందరగోళంగా, ఆగమాగంగా అనిపిస్తుంది. దీనిని సాధారణంగా అలవాటుపడటం అని అంటారు. ఎందుకంటే కొంతమంది ఇప్పటికీ ఏసీ లేకుండానే జీవిస్తున్నారు. ఏసీకి అలవాటుపడటం ఒక వ్యాధి కాదని, అది శరీరం అలవాటుపడిన ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మీరు ఎక్కువసేపు చల్లని ప్రదేశంలో కూర్చున్నప్పుడు, మీ శరీరం ఆ వాతావరణానికి అలవాటుపడుతుంది. అందువల్ల, మీరు బయట వేడిలోకి అడుగుపెట్టిన వెంటనే, మీ శరీరం వేడిని, మార్పును తట్టుకోలేక అసౌకర్యంగా అనిపించడం మొదలవుతుంది. మీరు చల్లని వాతావరణం నుండి వెచ్చని వాతావరణానికి వెళ్లినప్పుడు, మీ రక్తనాళాలు వేగంగా వ్యాకోచిస్తాయి. దీనివల్ల ఆయాసం వస్తుంది. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి శరీరం మరింత కష్టపడాల్సి ఉంటుంది. దీనివల్ల కూడా ఆయాసం, ఆందోళన కలగవచ్చు. ముందు నుంచే ఆస్తమా లేదా శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు మరింత ఇబ్బంది పడవచ్చు.

## ఈ ప్లేస్‌లో స్ప్రే చేస్తే రోజంతా పరిమళమే!



వేసవి కాలం రాకతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ఈ మార్పు కేవలం మన ఆహారపు అలవాట్లపైనే కాకుండా మనం వాడే సుగంధ ద్రవ్యాల పైన కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. చలికాలంలో రోజంతా తాజాగా అనిపించే పర్ఫ్యూమ్, ఎండాకాలంలో మాత్రం కొద్దిసేపటికే ఆవిరైపోవడం మనం గమనిస్తూనే ఉంటాం. దేశంలో మారుతున్న వాతావరణానికి అనుగుణంగా మన జీవనశైలిని మార్చుకున్నట్లే, పర్ఫ్యూమ్ ఎంపికలో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఎండ వేడికి పర్ఫ్యూమ్ ఎందుకు త్వరగా ఆవిరైపోతుంది? వేసవిలో కూడా రోజంతా పరిమళం వెదజల్లాలంటే ఎటువంటి సువాసనలు ఎంచుకోవాలి? సాధారణంగా ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు పర్ఫ్యూమ్‌లో ఉండే తేలికపాటి మూలకాలు చాలా వేగంగా ఆవిరైపోతాయి. దీనివల్ల శీతాకాలంలో రోజంతా ఉండే సువాసన, ఎండాకాలంలో మాత్రం కొద్ది గంటలకే మాయమవుతుంది. దీనికి తోడు చమట తోడైతే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది. చమట వల్ల పర్ఫ్యూమ్ సువాసన పలచబడటమే కాకుండా, దాని అసలు వాసన మారిపోయే అవకాశం కూడా ఉంది. అందుకే వేసవిలో పర్ఫ్యూమ్ ఎంపికలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎండాకాలంలో గాఢమైన వాసనల కంటే తేలికపాటి మరియు స్వచ్ఛమైన అనుభూతినిచ్చే సువాసనలను ఎంచుకోవడం ఉత్తమం. నిమ్మ, బెర్గామోట్, మాండరిన్ మరియు ద్రాక్ష వంటి సిట్రస్ నోట్స్ తక్షణమే తాజాదనాన్ని ఇస్తాయి. అలాగే అక్వాటిక్ మరియు మెరైన్ నోట్స్, వెటివర్ లేదా జెరేనియం వంటి వాటితో కలిపి వాడితే గాలిలో తేలుతున్నట్లుగా హాయిగా అనిపిస్తుంది. పుదీనా, తులసి, గ్రీన్ టీ వంటి గ్రీన్ నోట్స్ తీక్షణతను ఇస్తే.. జాస్మిన్, రోజ్ వంటి పూల సువాసనలు సున్నితత్వాన్ని అందిస్తాయి. అయితే ఈ తేలికపాటి పర్ఫ్యూమ్‌లు గాఢమైన వాటిలా ఎక్కువ సేపు ఉండవని గుర్తించాలి. సువాసన ఎక్కువ సేపు ఉండాలంటే దానిని ఉపయోగించే విధానం కూడా చాలా ముఖ్యం. పొడి చర్మం కంటే తేమగా ఉన్న చర్మంపై పర్ఫ్యూమ్ ఎక్కువ సేపు నిలుస్తుంది. కాబట్టి స్నానం చేసిన తర్వాత మాయిశ్చరైజర్ రాసుకుని, ఆపై పర్ఫ్యూమ్ కొట్టుకోవడం మంచిది. ముఖ్యంగా మణికట్టు, మెడ, చెవుల వెనుక వంటి 'పల్స్ పాయింట్స్' దగ్గర స్ప్రే చేయడం వల్ల శరీర వేడికి సువాసన సహజంగా వ్యాపిస్తుంది. ఒకే రకమైన సువాసన కలిగిన లోషన్ లేదా పౌడర్ వాడటం వల్ల పర్ఫ్యూమ్ ప్రభావాన్ని పెంచవచ్చు. వేసవిలో ఒకేసారి కొట్టుకుని రోజంతా ఉండాలని ఆశించడం కంటే, ప్రతి కొన్ని గంటలకు ఒకసారి పర్ఫ్యూమ్‌ను మళ్ళీ స్ప్రే చేయడం ఉత్తమం. ఇందుకోసం చిన్న సైజులో ఉండే ట్రావెల్ ప్యాక్‌లు లేదా పాకెట్ పర్ఫ్యూమ్‌లను వెంట ఉంచుకోవడం ప్రాక్టికల్ గా ఉంటుంది. వేసవిలో పర్ఫ్యూమ్ వాడటం అనేది కేవలం ఎదుటివారిని ఆకర్షించడం కోసం మాత్రమే కాదు, మన చుట్టూ ఉన్న వాతావరణానికి మనం అలవాటు పడటం కోసం కూడా. సరైన పర్ఫ్యూమ్‌ను ఎంచుకుని, దానిని సరిగ్గా ఉపయోగిస్తే ఎండల తీవ్రతలో కూడా మీరు ఎప్పుడూ ఉత్సాహంగా, తాజాగా కనిపిస్తారు.

## ఇండక్షన్ స్టౌపై ఈ వృత్తాకార గుర్తు ఎందుకు ఉంటుంది?




ప్రస్తుతం సర్వత్రా ఎల్‌పిజి గ్యాస్ కొరత వేదిస్తుంది. దీంతో దాదాపు అన్ని ఇళ్లల్లో ఇండక్షన్ వాడకం పెరిగింది. కానీ మీరు ఎప్పుడైనా దానిని దగ్గరగా గమనించారా? ఇండక్షన్‌పై ఒక ప్రత్యేకమైన గుండ్రని ఆకారం ఉంటుంది. అది దేనికి ఉపయోగపడుతుందో మీకు ఎప్పుడైనా సందేహం కలిగిందా? మనం దాదాపు దీనిని పట్టించుకోము. ఇది కేవలం పాత్రలు స్టవ్‌పై ఉంచడానికి మాత్రమే అని అనుకుంటాం. ప్రస్తుతం సర్వత్రా ఎల్‌పిజి గ్యాస్ కొరత వేదిస్తుంది. దీంతో దాదాపు అన్ని ఇళ్లల్లో ఇండక్షన్ వాడకం పెరిగింది. కానీ మీరు ఎప్పుడైనా దానిని దగ్గరగా గమనించారా? ఇండక్షన్‌పై ఒక ప్రత్యేకమైన గుండ్రని ఆకారం ఉంటుంది. అది దేనికి ఉపయోగపడుతుందో మీకు ఎప్పుడైనా సందేహం కలిగిందా? మనం దాదాపు దీనిని పట్టించుకోము. ఇది కేవలం పాత్రలు స్టవ్‌పై ఉంచడానికి మాత్రమే అని అనుకుంటాం. ఈ వలయం కేవలం పాత్రల కోసం మాత్రమే కాదు, ఇది మీ ఇంటి విద్యుత్ బిల్లును కూడా నిర్ధారిస్తుంది. అంతేకాకుండా మీ ఇండక్షన్ ఎంతకాలం పనిచేస్తుందో కూడా ఇది నిర్ణయిస్తుంది. ఇండక్షన్ గ్లాస్‌పై ఉన్న వృత్తానికి కొంచెం కింద రాగి లేదా అల్యూమినియంతో చేసిన అయస్కాంత కాయిల్ ఉంటుంది. మీరు స్విచ్ ఆన్ చేసినప్పుడు, ఈ కాయిల్ విద్యుదయస్కాంత తరంగాలను ఉత్పత్తి చేస్తుంది. మీరు పాత్రను ఈ వృత్తం మధ్యలో ఉంచినట్లయితే, 90 శాతం శక్తి పాత్రను వేడి చేయడానికి ఉపయోగించబడుతుంది.

ఒకవేళ పాత్ర వృత్తం వెలుపల ఉన్నా లేదా వృత్తం కంటే చాలా చిన్నదిగా లేదా పెద్దదిగా ఉన్నా అయస్కాంత తరంగాలు పాత్రకు సరిగ్గా చేరవు. దీనివల్ల ఆహారం నెమ్మదిగా ఉడుకుతుంది. ఫలితంగా విద్యుత్ వినియోగం అధికమవుతుంది. మీరు గిన్నె అడుగుభాగం చుట్టుకొలతకు సరిపోని విధంగా దానిని ఉంచితే, గిన్నెను వేడి చేయడానికి ఇండక్షన్ రెట్టింపు కష్టపడాల్సి వస్తుంది. దీనివల్ల ఆహారం ఉడకడానికి 15 నుండి 20 నిమిషాలు ఎక్కువ సమయం పట్టవచ్చు. అంతేకాకుండా దీనివల్ల మీ విద్యుత్ బిల్లు 20 నుండి 30 శాతం వరకు పెరగవచ్చు. ఈ గుండ్రని రింగ్ కింద ఉష్ణోగ్రతను నియంత్రించే సెన్సార్లు అమర్చబడి ఉంటాయి. పాత్రాను తప్పుగా అమర్చితే, ఇండక్షన్ కాయిల్ అధికంగా వేడెక్కుతుంది. దీనివల్ల మెషీన్‌లోని మెయిన్ సర్క్యూట్ (ఖఅః) కాలిపోయే అవకాశాలు పెరుగుతాయి. అంతేకాకుండా మీ ఖరీదైన ఇండక్షన్ అకాలంగా పాడైపోవచ్చు. అందువల్ల, ఇండక్షన్ మీద వంట చేసేటప్పుడు పాత్రను ఎల్లప్పుడూ వృత్తంకి సరిగ్గా సరిపోలా చూసుకోవాలి. వీలైతే, ఇండక్షన్ వృత్తం పరిమాణంలోనే ఉండే, చదునైన అడుగుభాగం గల పాత్రలను వాడటం మంచిది. పాత్ర మరీ పెద్దదిగా గానీ, మరీ చిన్నదిగా గానీ ఉండకూడదు.

## జ్ఞాపకశక్తి మందగిస్తోందా..?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మతి మరుపు అనేది వయసుతో సంబంధం లేకుండా అందరినీ వేధిస్తున్న సమస్య. ముఖ్యంగా జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారానికి అలవాటు పడటం వల్ల మెదడు పనితీరు మందగిస్తోంది. అయితే, మన ఇంట్లో దొరికే సహజసిద్ధమైన ఆహారంతోనే జ్ఞాపకశక్తిని అద్భుతంగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మతి మరుపు అనేది వయసుతో సంబంధం లేకుండా అందరినీ వేధిస్తున్న సమస్య. ముఖ్యంగా జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారానికి అలవాటు పడటం వల్ల మెదడు పనితీరు మందగిస్తోంది. అయితే, మన ఇంట్లో దొరికే సహజసిద్ధమైన ఆహారంతోనే జ్ఞాపకశక్తిని అద్భుతంగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. బయటి ఆహారంలో ఉండే ప్రిజర్వేటివ్స్, మితిమీరిన ఉప్పు, చక్కెర మెదడులోని నాడులను బలహీనపరుస్తాయి. దీనికి విరుద్ధంగా, ఇంట్లో వండుకునే భోజనంలో ఉండే పోషకాలు మెదడుకు కావాల్సిన ఇంధనాన్ని అందిస్తాయి. పాలకూర, తోటకూర వంటి వాటిలో ఉండే ఫోలేట్, విటమిన్ ఐ మెదడు కణాల క్షీణతను అడ్డుకుంటాయి. మన వంటింట్లో ఉండే యాంటీ సెప్టిక్ పసుపు. ఇందులో ఉండే కర్కుమిన్ మెదడులోని వాపును తగ్గించి, అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. వాల్ నట్స్, బాదం, అవిసె గింజల్లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు చురుకుదనానికి తోడ్పడతాయి. రాగులు, జొన్నలు, సజ్జలు వంటి తృణధాన్యాల వల్ల మెదడుకు శక్తి నిరంతరాయంగా అందుతుంది. పేగు ఆరోగ్యం బాగుంటేనే మెదడు బాగుంటుంది. పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంచుతాయి. మనం తీసుకునే ఆహారం కేవలం కడుపు నింపడానికే కాదు.. అది మన ఆలోచనా సరళిని, జ్ఞాపకశక్తిని కూడా నిర్దేశిస్తుంది. ఇంట్లో వండుకున్నా సరే, మితిమీరిన కారం, నూనె మెదడుపై ప్రభావం చూపుతాయి. రోజూ ఒక సీజనల్ పండు తినడం వల్ల మెదడుకు అవసరమైన యాంటీ ఆక్సిడెంట్స్ అందుతాయి. డీహైడ్రేషన్ వల్ల కూడా మతిమరుపు వస్తుంది, కాబట్టి రోజూ సరిపడా నీరు తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## భారత జట్టు నుంచి రోహిత్, కోహ్లీ ఔట్..
# శత్రువులని కొని తెచ్చుకున్న గంభీర్..



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గురించి మాజీ పేసర్ మునాఫ్ పటేల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. గంభీర్‌ను కోచ్ పదవి నుంచి తొలగించవద్దని భారత క్రికెట్ నియంత్రణ మండలి ( ని హెచ్చరించాడు. అది ఏమాత్రం ఇండియన్ టీమ్ కి మంచిది కాదని పేర్కొన్నారు. ఎందుకంటే, రోహిత్ శర్మ- విరాట్ కోహ్లీ లాంటి స్టార్ ఆటగాళ్లకు మొహమాటం లేకుండా 'నో' చెప్పే ధైర్యం ఒక్క గంభీర్‌కే ఉందని మునాఫ్ పటేల్ అభిప్రాయపడ్డారు. గంభీర్ ఉన్నది ఉన్నట్లు మాట్లాడే వ్యక్తి, జట్టు ప్రయోజనాల కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి ఆయన వెనుకాడరని మునాఫ్ పటేల్ వెల్లడించారు. జట్టులో క్రమశిక్షణను కాపాడటంలో గంభీర్ పాత్ర కీలకం, అతడ్ని తొలగిస్తే టీమ్ మేనేజ్‌మెంట్ కష్టమవుతుందని తెలిపారు. గౌతమ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ అద్భుతమైన విజయాలు సాధించిందని చెప్పుకొచ్చాడు. గంభీర్ సారథ్యంలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్, టీ20 ప్రపంచ కప్ వంటి మూడు ప్రధాన టోర్నీలను కైవసం చేసుకుంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అద్భుతంగా రాణించినప్పటికీ, టెస్ట్ క్రికెట్‌లో జట్టు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేకపోతున్నాయి పేర్కొన్నాడు. ప్రస్తుతం మునాఫ్ పటేల్ ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో, 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 5వ స్థానంలో ఢిల్లీ కొనసాగుతోంది. ఒకవైపు గంభీర్ కోచింగ్ శైలిపై చర్చ జరుగుతుంటే, మరోవైపు మునాఫ్ పటేల్ లాంటి మాజీ ఆటగాళ్లు అతడికి అండగా నిలవడం ఆసక్తికరంగా మారింది.

# రోహిత్ శర్మ గాయంపై బిగ్ అప్‌డేట్.. ముంబై ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై ఇండియన్స్ జట్టు ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచులో టార్గెట్ ఛేదనలో ముంబై ఓపెనర్ రోహిత్ శర్మ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్ గా మైదానం వీడాడు. దీంతో 241 రన్స్ ఛేదనలో ముంబై కేవలం 222 పరుగులకే పరిమితమైంది. అప్పటికి రోహిత్ 13 బంతుల్లో 19 రన్స్ చేశాడు. ఈ క్రమంలో రోహిత్ గాయంపై సర్వత్రా టెన్షన్ నెలకొంది. కానీ, అతడికి సంబంధించి మెడికల్ రిపోర్ట్ వచ్చింది. కండరాలు పట్టేయడంతో స్టేడియం వీడిన అతడు.. స్కానింగ్ తీయించుకున్నాడు. మెడికల్ రిపోర్ట్ ప్రకారం ఎలాంటి చీలిక లేదని తేలిపోయింది. దీంతో ముంబై ఇండియన్స్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. పంజాబ్ కింగ్స్ జట్టుతో గురువారం (026, ఏప్రిల్ 16న) మ్యాచ్లో ఆడతాడో? లేదో అనేది ఇంకా గందరగోళంగానే ఉంది. గాయం మరీ పెద్దది కాకపోవడంతో ఫస్ట్ అనుకున్నట్లు మరిన్ని మ్యాచులకు మాత్రం దూరమయ్యే ఛాన్స్ లేదు. ఇవాళ సాయంత్రానికి రోహిత్ శర్మ ఫిట్ నెస్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అద్భుతమైన ఫామ్ లో ఉన్న రోహిత్ సేవలు జట్టుకి ఎంతో అవసరం. కనీసం అతడిని ఇంపాక్ట్ ప్లేయర్ గానైనా బరిలోకి దింపే అవకాశం ఉంటుందని ఐపీఎల్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఐపీఎల్లో ఒక ఫ్రాంచైజీ తరపున 6వేల రన్స్ చేసిన బ్యాటర్ గా హిట్ మ్యాన్ నిలిచాడు. ఈ సీజన్లో ముంబై నాలుగు మ్యాచుల్లో ఒకేఒక్క విజయం సాధించింది. ప్లేఆఫ్స్ కి చేరుకోవాలంటే ఇక నుంచి ప్రతి మ్యాచ్ గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు బ్యాటింగ్ లో ఫర్వాలేదనిపిస్తోన్న ఎంఐ.. బౌలింగ్ మాత్రం తేలిపోతోంది. స్టార్ పేసర్లు బుమ్రా, బౌల్ట్ ప్రభావం చూపింలేక, ఘోరంగా విఫలమవుతున్నారు.

# లక్నో ఐం ఆర్సీబీ మధ్య హై వోల్టేజ్ ఫైట్.. విన్నర్ మాత్రం ఆ జట్టే!



**హైదరాబాద్ పెన్ పవర్:** మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ లక్నో సూపర్ జయంట్స్ జట్లు కాసేపట్లో (2026, ఏప్రిల్ 15న) పోటీ పడబోతున్నాయి. గత మ్యాచ్‌లో ముంబైపై సాధించిన విజయంతో ఆర్‌సీబీ పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉండగా, లక్నో గత మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓటమిని ఎదుర్కొని ఈ మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. కాగా ఈరోజు జరిగే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అత్యధిక పరుగులు చేసే అవకాశం కనిపిస్తుంది. తన సొంత గడ్డ (చిన్నస్వామి స్టేడియం)పై ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ ఇప్పటికే 97 పరుగులు సాధించి మంచి ఫామ్‌లో ఉన్నాడు.

**విజేత ఎవరంటే?:**

ప్రస్తుత ఫామ్, హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్‌ను బట్టి చూస్తే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) టీమ్ ఈ మ్యాచ్‌లో హాట్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. గూగుల్ స్పోర్ట్స్ డేటా ప్రకారం.. ఆర్‌సీబీ గెలిచే అవకాశం 62.3 శాతం ఉండగా, లక్నో సూపర్ జెయింట్స్ గెలిచే అవకాశం 37.7 శాతం మాత్రమే ఉందని తెలిపింది.

**పిచ్ రిపోర్ట్:**

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఎప్పుడూ బ్యాటర్లకు స్వర్గధామంగా ఉంటుంది. చిన్న బౌండరీలు, ఫ్లాట్ వికెట్ వల్ల ఇక్కడ పరుగుల వరద పారడం ఖాయం. ఆర్‌సీబీ గతంలో ఇక్కడ 250o పరుగులు కూడా సాధించింది, కాబట్టి ఈరోజు కూడా భారీ స్కోర్లు నమోదు అయ్యే అవకాశం ఉంది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, రసిక్ సలామ్, జోష్ హాజిల్‌వుడ్.

ఇంపాక్ట్ ప్లేయర్: సుయాష్ శర్మ

లక్నో సూపర్ జయంట్స్: ఐడెన్ మార్క్రామ్, మిచెల్ మార్ష్, రిషబ్ పంత్, ఆయుష్ బదోని, నికోలస్ పూరన్, అబ్దుల్ సమద్, ముకుల్ చౌదరి, జార్జ్ లిండే/అన్రిచ్ నోర్జే, మహమ్మద్ షమీ, అవేష్ ఖాన్, దిగ్వేష్ సింగ్ రాఠీ.

ఇంపాక్ట్ ప్లేయర్: ప్రిన్స్ యాదవ్

## కృతి శెట్టి బ్లాక్ స్ట్రాప్‌లెస్ గౌన్‌లో డ్రీమీ లుక్‌తో స్టన్ చేసింది



# టాప్- 10 హీరోయిన్ల చీర సొగసు



-తక్కువలోనే ఎక్కువ అందం- అన్నట్లుగా ఆకట్టుకున్నారు.ఓవరాల్ గా అగ్ర కథానాయికలందరూ చీరకట్టులో మెరిసిపోతూ ఫ్యాషన్ ప్రియులకు గొప్ప ప్రేరణగా నిలిచారు. ఆధునిక కాలంలో వెస్టర్న్ దుస్తులకు ఎంత ప్రాధాన్యత ఉన్నా.. పండుగ వేళ చీరకట్టు ఇచ్చే ఆత్మవిశ్వాసం, గౌరవం మరే ఇతర దుస్తుల్లోనూ ఉండదని ఈ భామల ఫోటోలు నిరూపిస్తున్నాయి. ఈ విషు వేడుకల్లో తారల -చీర సొగసు- సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారి పండుగ సంబరాలను రెట్టింపు చేసింది.

## మెరూన్ లెహంగా లుక్



భారతీయ సంప్రదాయంలో చీరకు ఉన్న ప్రాధాన్యత గురించి తెలిసిందే. పండుగ ఏదైనా.. భామలు చీరకడితే ఆ కళే వేరు. 2026 -విషు- పండుగ సందర్భంగా భారతీయ చలనచిత్ర రంగంలోని అగ్ర కథానాయికలు తమ చీరకట్టుతో సౌందర్యాన్ని, మోడ్రన్ స్టైల్ ను మేళవించి సరికొత్త ట్రెండ్‌ను సెట్ చేస్తున్నారు. సంప్రదాయ నేత మొదలుకొని .. సింపుల్ ఆర్గంజా వస్త్రాల వరకు తారలు తమ ఫ్యాషన్ ఎంపికలతో పండుగ వాతావరణానికి మరింత శోభను చేకూర్చారు. మహానటి కీర్తి సురేష్ తన రాయల్ గోల్డ్ చీరలో అచ్చమైన తెలుగింటి ఆడపడుచులా మెరిసిపోతున్నారు. దీనికి స్టేట్‌మెంట్ టెంపుల్ జువెలరీని జోడించి పండుగ కళను ఉట్టిపడేలా చేశారు. అలాగే త్రిష కృష్ణన్ క్రీమ్ అండ్ గోల్డ్ సిల్క్ చీరలో క్లాసిక్ లుక్‌ను ప్రదర్శించగా.. రెడ్ కలర్ బ్లౌజ్ ఆ అందానికి మరింత మెరుగులు దిద్దింది. నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఆఫ్-వైట్ సిల్క్ చీరలో... జుట్టులో మల్లెపూలతో దేవకన్యలా కనిపిస్తూ విషు పండుగ విశిష్టతను చాటిచెప్పారు.

మరోవైపు నయనతార బంగారు వర్ణం టిష్యూ సిల్క్ చీరలో రాచరికపు హుందాతనాన్ని ఒలకబోయగా... సమంత రూత్ ప్రభు పసుపు - ఆకుపచ్చ రంగుల మేళవింపుతో కూడిన చీరలో దేవకన్యను తలపిస్తున్నారు. పార్వతి ఎరుపు రంగు చీరపై గోల్డెన్ ఫాయిల్ వర్క్‌తో సంప్రదాయ మూలాలను ప్రతిబింబించగా.. అదితి రావు హైదరీ ఊదా రంగు చీర -భారీ ఆభరణాలతో పండుగ వైబ్ ని నింపారు. వీరందరి మేకోవర్స్ సంప్రదాయానికి పట్టాభిషేకం చేసినట్లుగా ఉన్నాయి. ప్రయోగాలకు వేదికగా నిలిచిన రుక్మిణి గ్రీన్-అండ్-పింక్ కాంట్రాస్ట్ చీరలో కట్ అవుట్ బ్లౌజ్‌తో విభిన్నంగా కనిపించగా... సాన్యా మల్హోత్రా బేబీ పింక్ ఆర్గంజా చీరను పర్పుల్ బ్రోకేడ్ బ్లౌజ్‌తో జతచేసి రొమాంటిక్ అండ్ ఫెస్టివ్ లుక్‌ను సృష్టించారు. జాన్వీ కపూర్ హెవీ ఎంబ్రాయిడరీ గోల్డ్ చీరతో తన గ్లామర్‌ను ప్రదర్శిస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలియా భట్ మాత్రం సింపుల్ బ్లూ ప్రింటెడ్ చీరతో

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965